


శుక్రవారం 3 జూలై 2026 పేజీలు : 8

## కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ హామీలపై

# అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీయాలి



బీసీ హక్కుల అమలుకు బీఆర్ఎస్ ఉద్యమాలు చేపట్టాలి బీసీ సంఘాల విమర్శ

మాజీ మంత్రి హరీష్ రావుకు జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి వినతి

ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం

## కార్మికుల పోరాటాలతోనే హక్కులు

# సాధించుకుంటాం




పాలడుగు భాస్కర్, సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కనీస వేతనాల పెంపు అంటూ కార్మికులను మోసం చేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం

మంచిర్యాల జిల్లా విస్తృతస్థాయి సమావేశం

# మహిళల భద్రతకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలి



జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా వ్యాప్తంగా పోలీస్ అక్క, షీటీం సిబ్బందితో సమీక్ష స మావేశం

జూన్ నెలలో షీటీం తో 90 ఫిర్యాదుల పరిష్కారం 157 హాట్‌స్పాట్లలో ప్రత్యేక నిఘా

87 మంది ఆకతాయిలు రెడ్ హ్యాండెడ్ 52 పెట్టి కేసులు, 1 ఎఫ్ఐఆర్ నమోదు

ఒక బాల్య వివాహాన్ని అడ్డుకున్న షీటీం 76 అవగాహన కార్యక్రమాలు, 48 గ్రామాల సందర్శన,

వారంలో మూడు పాఠశాలల ను, మూడు గ్రామాలను సందర్శించి మహిళల సమస్యలను తెలుసుకోవాలి

# నాలుగో రోజుకు చేరుకున్న సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు

**మౌనం పాటిస్తున్న యాజమాన్యంపై అధికారుల ఆవేదన**

**డిమాండ్ల పరిష్కారంలో జాప్యం జరిగితే ఆందోళనలను ఉధృతం చేస్తామంటున్న సింగరేణి అధికారుల సంఘం**



**మంచిర్యాల, 2, జూలై (ప్రజాజ్యోతి):** సింగరేణి అధికారుల సంఘం (సీఎంఓఏఐ) పిలుపు మేరకు సింగరేణి వ్యాప్తంగా కొనసాగుతున్న అధికారుల రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని జీఎం కార్యాలయం వద్ద, అలాగే సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఎస్‌టీపీపీ) వద్ద అధికారులు తమ నిరసన కార్యక్రమాలను కొనసాగించారు. నాలుగో రోజు రిలే నిరాహార దీక్షల్లో పలువురు అధికారులు పాల్గొని తమ డిమాండ్ల సాధన కోసం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్పీ చెల్లింపులు, పే అప్‌గ్రేడేషన్ అమలు, ఉచిత విద్యుత్ సదుపాయం, ఫీజు రీయింబర్స్‌మెంట్, అధికారుల పదోన్నతులు, బదిలీల్లో పారదర్శకత, సింగరేణికి రావాల్సిన బకాయిల విడుదల వంటి ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం ఈ ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు సింగరేణిని తమ సొంత సంస్థగా భావించి సమయాభావం లేకుండా సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న అధికారులకు నిరసనల బాట పట్టాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా పలు రూపాల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నప్పటికీ యాజమాన్యం, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వెంటనే ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. డిమాండ్ల పరిష్కారంలో మరింత జాప్యం జరిగితే ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇక శ్రీరాంపూర్ ఏరియాలో నాలుగో రోజు రిలే నిరాహార దీక్షల్లో కె. రాజేందర్ (డిప్యూటీ ఎస్ఈ -- ఈఅండ్ఎం, ఎస్ఆర్పీ-1 ఇంక్లైన్), ఎం. శశాంక్ (సీనియర్ అండర్ మేనేజర్, ఆర్కే-7 ఇంక్లైన్), ఎల్. సామ్య నాయక్ (జూనియర్ సర్వే ఆఫీసర్, ఐకే-1ఏ), ఉబైద్ ఖాన్ (ఈఈ -- ఈఅండ్ఎం, ఎస్ఆర్పీ ఓసీపీ), పి. వివేక్ (జూనియర్ సర్వే ఆఫీసర్, ఐకేఓసీపీ), డి. ఓంకార్ (అండర్ మేనేజర్, ఆర్కే-5 ఇంక్లైన్), కె. అనూప్ యాదవ్ (అండర్ మేనేజర్, ఆర్కే-5 ఇంక్లైన్), కె. అరుణ్ కుమార్ (డిప్యూటీ ఎస్ఈ -- మైనింగ్, ఎస్ఆర్పీ 3 అండ్ 3ఏ ఇంక్లైన్) పాల్గొన్నారు. అదేవిధంగా ఎస్‌టీపీపీలో నాలుగో రోజు రిలే నిరాహార దీక్షల్లో ఎం.వి. వేణుగోపాల్ రావు (డీజీఎం--ఓ అండ్ ఎం), బి. తిరుమల్ (సీనియర్ ప్రోగ్రామర్--ఐటీ), ఎం. రాకేష్ (డిప్యూటీ ఎస్ఈ--ఈఅండ్ఎం), కె. రవిచంద్ర (ఈఈ--ఈఅండ్ఎం), ఎ. సాయి చరణ్ (ఈఈ--ఈఅండ్ఎం) పాల్గొన్నారు. సింగరేణిలోని పలు కార్మిక సంఘాలు కూడా అధికారుల నిరసనలకు సంఘీభావం తెలుపుతున్నాయి. దీంతో అధికారుల ఆందోళన కార్యక్రమాలు రోజురోజుకు మరింత బలపడుతున్నాయి.

# ప్రతి ఒక్కరు ఎస్ఐఆర్‌లో తమ ఓటును నమోదు చేసుకోవాలి

**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి**





**మంచిర్యాల, 2, జూలై (ప్రజాజ్యోతి):** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి అర్హుడైన వ్యక్తి తమ ఓటును నమోదు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో భాగంగా గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 46వ డివిజన్, 174వ బూత్‌లో ప్రజలను కలిసి ఎన్యుమరేషన్ ఫారం నింపడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, "ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రతి అర్హుడైన ఓటరు బీఎల్‌వోలు అందజేసిన ఎన్యుమరేషన్ ఫారంను సరైన పద్ధతిలో నింపి తిరిగి అందించాలి. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి" అని అన్నారు. అలాగే, "ఎన్యుమరేషన్ ఫారం నింపడంలో ప్రజలకు సహకరించేందుకు ప్రతి బూత్‌లో బీజేపీ పార్టీ తరఫున బీఎల్ఏ-2లను నియమించాం. ఓటర్లకు ఏవైనా అభ్యంతరాలు, సందేహాలు ఉంటే వారు తమ ప్రాంతంలోని బీఎల్ఏ-2లను సంప్రదించవచ్చు" అని తెలిపారు. ఇంకా మాట్లాడుతూ, "అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా తొలగించబడదు. అయితే కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీ పార్టీ ఓట్లను తొలగిస్తుందంటూ ప్రజల్లో దుష్ప్రచారం చేస్తున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్యుమరేషన్ ఫారం నింపిన ప్రతి అర్హుడైన ఓటరుకు ఓటు హక్కు కల్పించడం జరుగుతుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో అమీరిశెట్టి రాజ్‌కుమార్, ముచ్చుకుర్తి కిషోర్, అవిడపు రాజబాబు, బింగి ప్రవీణ్, నల్ల రవి, అంకం మనోజ్, బండి శంకర్, కునారపు రమేష్, కంచర్ల శ్రీకాంత్, కలవేని సంపత్, అశోక్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలి

**కలెక్టర్ కుమార్ దీపక్**

**భూమి సమస్యల పరిష్కారానికి సమగ్ర సర్వే, పారదర్శక మ్యాపింగ్ చేపడుతున్నాం**

**పాఠశాలలు, అమృత్ 2.0 పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్**





**మంచిర్యాల, 2, జూలై (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన భూ సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం భీమారం మండలం మద్దికల్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల తహసీల్దార్ సదానందంతో కలిసి పాల్గొన్న ఆయన భూ సర్వే ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డుల ఆధారంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. మొదట గ్రామ పరిధిలోని భూములకు హద్దులను నిర్ధారించడం ద్వారా గ్రామ భూములపై స్పష్టత తీసుకురావడంతో పాటు ప్రభుత్వ భూములను కూడా గుర్తించడం జరుగుతుందని తెలిపారు. పట్టా ఉండి మోకాలో నమోదు కాకపోవడం, మోకాలో ఉండి పట్టా లేకపోవడం వంటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూ సర్వే ప్రక్రియను సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేపట్టడం వల్ల భూ సమస్యలు తలెత్తినప్పుడు న్యాయపరమైన పరిష్కారం సులభతరం అవుతుందని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు కొనసాగుతున్నాయని, సంబంధిత వ్యక్తులకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయడం జరుగుతుందని చెప్పారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పౌష్టికాహారం, శుద్ధమైన త్రాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి విద్యార్థుల చేరికలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. తదుపరి క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో అమృత్ 2.0 పథకం కింద కొనసాగుతున్న నీటి ట్యాంక్, పైప్‌లైన్ నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ప్రజలకు నిరంతర త్రాగునీటి సరఫరా లక్ష్యంగా చేపట్టిన పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మంచిర్యాల జిల్లా బీజేపీలో వివిధ సెల్స్‌కు నూతన నియామకాలు

**పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలి**

**మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్**

**జిల్లా సెల్ కన్వీనర్లు, కో-కన్వీనర్లకు అభినందనలను తెలిపిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి**



**మంచిర్యాల, 2, జూలై (ప్రజాజ్యోతి):** భారతీయ జనతా పార్టీ మంచిర్యాల జిల్లా సంస్థాగత బలోపేతంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ సెల్స్‌కు కన్వీనర్లు, కో-కన్వీనర్లను నియమించినట్లు బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ గురువారం తెలిపారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆయన అన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడం, వివిధ సామాజిక వర్గాలు, వృత్తి రంగాలు, ఉద్యోగులు, యువత, కార్మికులు, మేధావులు, ప్రవాస భారతీయులతో పార్టీ అనుసంధానాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ నియామకాలు చేపట్టినట్లు వివరించారు . లీగల్ సెల్ కన్వీనర్‌గా పుడారి రమేష్‌ను నియమించగా, కో-కన్వీనర్లుగా బండెల రవీందర్, గోలి శ్రీనివాస్, మద్ది కార్తీక్‌లను నియమించారు. ఇంటెలెక్చువల్ సెల్ కన్వీనర్‌గా కర్రె లచ్చన్నను నియమించగా, కో-కన్వీనర్లుగా బుద్దే లక్ష్మణ్, బుడిమె విజయ్‌లను నియమించారు. ప్రొఫెషనల్స్ సెల్ కన్వీనర్‌గా బండవరపు జగన్, మెడికల్ సెల్ కన్వీనర్‌గా డా. బొడ్డు రఘునందన్, ఫైనాన్షియల్ సెల్ కన్వీనర్‌గా చిట్టినేని హన్మంత్ రావును నియమించగా, కో-కన్వీనర్‌గా గడియారం మురళిని బాధ్యతలు అప్పగించారు. అలాగే కో-ఆపరేటివ్ సెల్ కన్వీనర్‌గా బెడద సురేష్‌ను నియమించగా, కో-కన్వీనర్లుగా పెద్దింటి పున్నం చంద్, సిపిరిశెట్టి శ్రీనివాస్‌లను నియమించారు. ఇక కల్చరల్ సెల్ కన్వీనర్‌గా అవిడపు రాజబాబు, వీవర్స్ సెల్ కన్వీనర్‌గా బొప్పు కిషన్, టీచర్స్ సెల్ కన్వీనర్‌గా బుద్దారపు రాజమౌళి, ఫిషర్‌మెన్ సెల్ కన్వీనర్‌గా గడ్డం మల్లయ్య, ట్రేడ్ సెల్ కన్వీనర్‌గా కొటగిరి రవి కుమార్ (సురభి), స్పోర్ట్స్ సెల్ కన్వీనర్‌గా గాజుల ప్రభాకర్, లేబర్ సెల్ కన్వీనర్‌గా గెల్లు మల్లేష్, దివ్యాంగ్ సెల్ కన్వీనర్‌గా గడికొప్పుల చంద్రమౌళి, ఎండోమెంట్ సెల్ కన్వీనర్‌గా బింగి ప్రవీణ్‌లను నియమించారు. ఈ సెల్స్‌కు కో-కన్వీనర్లుగా వంగల కోమురయ్య, వొడ్నాల స్వామి, వూట్ల సత్యనారాయణ, ఎస్ వీరబ్రహ్మం, బోరె యాదగిరి, బొగ్గుల శ్రీనివాస్, కందే ఓం నమశ్శివాయ, పెంద్రం సతీష్, అన్నం శివ, చల్లా విక్రమ్, తగరం శ్రీనివాస్, పి. లక్ష్మీనారాయణ గౌడ్, డా. బ్రహ్మానందం, మిట్టపల్లి ప్రవీణ్, కందే శ్రీమాన్ నారాయణ తదితరులను నియమించారు. అదేవిధంగా ప్రవాసి సెల్ కన్వీనర్‌గా జె మహేందర్, స్పెషల్ కాంటాక్ట్ సెల్ కన్వీనర్‌గా గుండ ప్రభాకర్, సీనియర్ సిటిజన్ సెల్ కన్వీనర్‌గా బండారి సత్యనారాయణ, సినిమా సెల్ కన్వీనర్‌గా ఉప్పుల మోహన్, పంచాయతీ రాజ్ సెల్ కన్వీనర్‌గా మంత్రి రామయ్య, మున్సిపల్ సెల్ కన్వీనర్‌గా బొట్ల సత్యం, ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్‌గా బుద్దినేని స్వరూన్, గీత సెల్ కన్వీనర్‌గా పాదాల సంజీవ్ గౌడ్, సింగరేణి కార్మిక సెల్ కన్వీనర్‌గా కాశెట్టి నాగేశ్వరరావులను నియమించారు. ఇక కో-కన్వీనర్లుగా ఉత్తమ్, రాదండి లావణ్య, బేర మురళి, యామగ్ర తుకారం, గోపగోని జనార్దన్ గౌడ్, నడిపెల్లి శ్రీనివాసరావు, బత్తుల శేఖర్, మొరుపుట్ల సంజీవ్, బుద్దే సిద్ధార్థ, కె. రామమూర్తి, బోయిని మోహన్, సదానందం గౌడ్, హరికృష్ణ తోడేటి, గొల్ల మహేందర్, గడికొప్పుల సురేందర్ తదితరులకు బాధ్యతలు అప్పగించారు. కాగా కల్చరల్ సెల్, స్పోర్ట్స్ సెల్, దివ్యాంగ్ సెల్, ప్రవాసి సెల్, సినిమా సెల్, ఎన్ఆర్ఐ సెల్‌లలో కొన్ని కో-కన్వీనర్ పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి నూతనంగా నియామకం పొందిన జిల్లా సెల్ కన్వీనర్లు, కో-కన్వీనర్లను అభినందించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీ అభివృద్ధి, సంస్థాగత బలోపేతం కోసం సమన్వయంతో పనిచేసి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆకాంక్షించారు.

# సింగరేణి పాలిటెక్నిక్ స్పాట్ కౌన్సెలింగ్ ముందుకు

**జూలై 4న సింగరేణి పాలిటెక్నిక్ స్పాట్ కౌన్సెలింగ్**

**సింగరేణి ఉద్యోగుల పిల్లల కోటా సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్**







**మంచిర్యాల, 2, జూలై (ప్రజాజ్యోతి)** : సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో జూన్ 11న నిర్వహించిన కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన సింగరేణి ఉద్యోగుల పిల్లల ప్రత్యేక కోటా సీట్ల భర్తీ కోసం నిర్వహించనున్న స్పాట్ కౌన్సెలింగ్ తేదీని ముందుకు మార్చినట్లు కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ కూర్మ రాజేందర్ తెలిపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 8న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉండగా, ప్రభుత్వ సూచనల మేరకు జూలై 4న నిర్వహించనున్నట్లు తెలిపారు. జూలై 8లోపు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయాలన్న సాంకేతిక విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ ప్రక్రియను ముందుకు జరిపినట్లు తెలిపారు . మొత్తం ఐదు విభాగాల్లో ఖాళీగా ఉన్న 84 సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. వీటిలో సివిల్ ఇంజినీరింగ్‌లో 22, కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో 11, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో 7, మెకానికల్ ఇంజినీరింగ్‌లో 21, మైనింగ్ ఇంజినీరింగ్‌లో 23 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే జూన్ 18 నుంచి కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జూలై 2తో ముగియనుంది. అభ్యర్థులు తమ సర్టిఫికెట్ల నాలుగు సెట్ల జిరాక్స్ ప్రతులు, ఆన్‌లైన్ దరఖాస్తు ప్రతిపై సంబంధిత గని అధికారి సంతకం, కార్యాలయ ముద్రతో పాటు సుమారు రూ. 20 వేల నగదు తీసుకుని జూలై 4న జరిగే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ కూర్మ రాజేందర్ తెలిపారు. సింగరేణి వారసులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు, ఆ తరువాత కూడా సీట్లు మిగిలితే ఇతరులకు కేటాయిస్తామని ఆయన వివరించారు.

## సీఎంఆర్ డెలివరీ ప్రక్రియ వేగవంతం చేయాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ వి. రాములు**

**మిషన్ కె-100 లక్ష్యంతో ధాన్యం సీఎంఆర్ డెలివరీ పూర్తి చేయాలని ఆదేశం**

**జూలై 15లోగా ధాన్యం బకాయిలు 100 శాతం చెల్లించాలి**



**మంచిర్యాల, 2, జూలై (ప్రజాజ్యోతి):** జిల్లాలోని రైస్ మిల్లర్లు 2025-26 రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి బ్రహ్మరావు, జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి రైస్ మిల్లర్లతో సీఎంఆర్ డెలివరీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత 2025-26 రబీ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ డెలివరీలను వేగవంతం చేయాలని తెలిపారు. అలాగే 2024-25 రబీ, 2025-26 ఖరీఫ్ సీజన్లకు సంబంధించిన ధాన్యం సీఎంఆర్ డెలివరీ ప్రక్రియపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. మిషన్ కె-100 కార్యక్రమంలో భాగంగా సీఎంఆర్ డెలివరీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ధాన్యం వేలాలకు సంబంధించిన పెండింగ్ బకాయిలను ఈ నెల 15వ తేదీలోగా వంద శాతం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు, మిల్లర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేసి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సురేష్

**దళితుల సంక్షేమానికి కృషి చేస్తా: సురేష్**



**ఆసిఫాబాద్ జులై 2 ప్రజాజ్యోతి** ఎస్సీ సంక్షేమ సంఘం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సాలెగూడ గ్రామానికి చెందిన చాపిడి సురేష్ నియమితులయ్యారు. సంఘం జాతీయ అధ్యక్షులు తీగల అశోక్ కుమార్ ఆమోదంతో, డాక్టర్ జాడి దిలీప్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం ఈ నియామకాన్ని ప్రకటించారు. సంస్థ విస్తరణ, బలోపేతం మరియు షెడ్యూల్డ్ కులాల సంక్షేమ లక్ష్యాల సాధన కోసం ఈ నియామకం చేపట్టినట్లు సంఘం తెలిపింది. షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ, విద్యా అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, సామాజిక న్యాయం, సంక్షేమ కార్యక్రమాల అమలులో సురేష్ సమర్థవంతంగా పనిచేస్తారని సంఘం విశ్వాసం వ్యక్తం చేసింది. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో సంఘం బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి, సామాజిక చైతన్య కార్యక్రమాల నిర్వహణకు ఆయన సేవలను అంకితం చేస్తారని ఆకాంక్షించారు. ఆసిఫాబాద్ మండలం సాలెగూడ గ్రామానికి చెందిన సురేష్ చాపిడి నియామకం పట్ల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారానికి జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్

**జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు**

**మంచిర్యాల, 2, జూలై (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 10న కెజీ నుంచి పీజీ వరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. ఈ బంద్‌కు విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజలు, మేధావులు సహకరించి విజయవంతం చేయాలని సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కొరత, మౌలిక వసతుల లేమి, హాస్టళ్లలో దయనీయ పరిస్థితులు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, విద్యార్థుల భద్రత వంటి సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటి పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని, విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అన్ని




విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందించాలని కోరారు. అదేవిధంగా ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా విద్యార్థుల భద్రత కోసం ప్రతి విద్యాసంస్థలో ఐసీసీ కమిటీలను ఏర్పాటు చేయాలని, విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని, జాతీయ విద్యా విధానం--2020 అమలును నిలిపివేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లాల శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దాగం శ్రీకాంత్, ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షులు డికొండ జతిన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు రెడ్డి చరణ్, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా ఇంచార్జ్ పసులేటి వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు సికిందర్ తదితరులు పాల్గొన్నారు

# మణుగూరు పీకే ఓసీ ప్రాజెక్టు బిడ్‌లో సింగరేణి పాల్గొనాలి

**సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యుడు పి. మాధవ నాయక్**



**మంచిర్యాల, 2, జూలై (ప్రజాజ్యోతి):** మణుగూరు పీకే ఓసీ డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టుకు సంబంధించి జరుగుతున్న ఫైనాన్షియల్ బిడ్ ప్రక్రియలో సింగరేణి యాజమాన్యం తప్పనిసరిగా పాల్గొని ప్రాజెక్టును దక్కించుకునేందుకు అన్ని విధాలా కృషి చేయాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యుడు పి. మాధవ నాయక్ డిమాండ్ చేశారు . ఈ మేరకు గురువారం బీఎంఎస్ భవన్‌లో కార్పొరేట్ ఏరియా అధ్యక్షుడు బి. రాంసింగ్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యుడు పి. మాధవ నాయక్, యూనియన్ అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ మణుగూరు పీకే ఓసీ డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టు సింగరేణి భవిష్యత్తుకు అత్యంత కీలకమని అన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టుకు సంబంధించి ఫైనాన్షియల్ బిడ్ ప్రక్రియ కొనసాగుతోందని, ఈ నెల 7వ తేదీలోపు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సింగరేణి బిడ్‌లో పాల్గొని సమర్థవంతమైన వ్యూహంతో ప్రాజెక్టును సాధించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖ ఈ ప్రాజెక్టు విషయంలో సింగరేణికి అనుకూల దృక్పథంతో ఉందని, అయితే తుది కేటాయింపులో ఫైనాన్షియల్ బిడ్ కీలకంగా మారనుందని , ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ చేజారనీయరాదన్నారు. మణుగూరు ప్రాంతంలోని ప్రస్తుతం కొనసాగుతున్న గనుల్లో బొగ్గు నిల్వలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో పీకే ఓసీ డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టు సింగరేణికి దక్కకపోతే భవిష్యత్తులో సంస్థ కార్యకలాపాలు, వేలాది మంది కార్మికుల ఉపాధి, స్థానిక ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో సుమారు 215 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఇది సంస్థ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో, ఉద్యోగ భద్రతకు, తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధికి కీలకంగా మారుతుందని తెలిపారు. దేశంలో బొగ్గు తవ్వకాల రంగంలో సింగరేణికి ఉన్న శతాబ్ద కాలపు అనుభవం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం కలిగిన ఉద్యోగులు, బలమైన మౌలిక సదుపాయాలతో ఈ ప్రాజెక్టును విజయవంతంగా నిర్వహించే సామర్థ్యం సింగరేణికే ఉందన్నారు. ఈ సమావేశంలో జి.వి. కృష్ణారెడ్డి, టీవీస్ పవన్ కుమార్, అజ్మీర వెంకటేశ్వర్లు, మొగిలిపాక రవి, నర్సింగరావు, నరేష్, బాలకృష్ణ, శ్రవణ్ కుమార్, ఎ.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

**సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించిన వైద్య హెచ్ఈఓ రవిదాస్**



**ఆసిఫాబాద్ జులై 2 (ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ వాంకిడి మండలం బంబారా ఆశ్రమోన్నత పాఠశాలలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, బోదకాలు, మెదడు వాపు, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకత, చేతులు శుభ్రపరచుకునే పద్ధతులను ఆరోగ్య సిబ్బంది వివరించారు. శిబిరంలో 42 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, హెచ్ఎం లక్ష్మీప్రసన్న, పీడీ కృష్ణ మూర్తి, వార్డెన్, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు సునంద, లక్ష్మి, ఆశా వర్కర్ సరోజ పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్పీ-3 గనిలో ప్రమాదం

**నలుగురు కార్మికులకు గాయాలు**

**హుటాహుటిన రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలింపు**



**మంచిర్యాల, 2, జూలై (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ-3 గనిలో గురువారం ప్రమాదం చోటుచేసుకుని నలుగురు కార్మికులు గాయపడినట్లు సమాచారం. గనిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో సైడ్ ఫాల్ కావడంతో ఈ ఘటన జరిగినట్లు తెలిసింది.వివరాల ప్రకారం, గురువారం ఉదయం మొదటి షిఫ్ట్‌లో ఎస్ఆర్పీ-3 గని 5 సీమ్ 10వ లెవెల్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులపై అకస్మాత్తుగా సైడ్ ఫాల్ జరిగింది. దీంతో అక్కడ పని చేస్తున్న కార్మికులు కలవేన మహేందర్, వై. సంపత్, జి. రవి, ఎం. సందీప్ గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే గనిలోని అధికారులు, సిబ్బంది అప్రమత్తమై గాయపడిన వారిని బయటకు తీసుకొచ్చి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. ప్రమాదంలో గాయపడిన కార్మికుల్లో కలవేన మహేందర్ ( ఈసీ నెం: 2966236, శ్రీరాంపూర్), వై. సంపత్ ( ఈసీ నెం: 2905612, సుందరయ్య కాలనీ), జి. రవి ( ఈసీ నెం: 2119619, శ్రీరాంపూర్), ఎం. సందీప్ (ఈసీ నెం: 2970219, కృష్ణ కాలనీ) ఉన్నారు. వీరి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనపై అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. కాగా గాయపడిన కార్మికులను రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు, కేంద్ర నాయకులు కలవేన శ్యామ్, రిక్కల గోపాల్ రెడ్డి, ఏంబడి తిరుపతి, మహేందర్ రెడ్డి, చందు మోహన్, రామకృష్ణ లు పరామర్శించారు .

## గంగాధర్ కుటుంబాన్ని పరామర్శించిన భూక్యా జాన్సన్ నాయక్



ఖానాపూర్ జూలై 2( ప్రజా జ్యోతి) ఇటీవల మృతి చెందిన శ్యామల ఘంటసాల గంగాధర్ కుటుంబాన్ని ఖానాపూర్ అసెంబ్లీ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ గురువారం కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు సామాజిక కార్యక్రమాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో తమ వంతు కృషిని వ్యాఖ్యాతగా గాయకుడిగా మరిపించిన గంగాధర్ మృతి తీరనిలోటని అన్నారు ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరారు

## శాంతినగర్ హనుమాన్ ఆలయ ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న

బీఆర్ఎస్ అసెంబ్లీ ఇంచార్జ్ జాన్సన్ నాయక్



ఖానాపూర్ జూలై 2(ప్రజా జ్యోతి) ఖానాపూర్ పట్టణంలోని శాంతినగర్ గత మూడు రోజులుగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హనుమాన్ ఆలయ పునర్నిర్మాణంతో పాటు ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరుగుతుంది ఈ సందర్భంగా గురువారం ఖానాపూర్ బి ఆర్ఎస్ అసెంబ్లీ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆలయాన్ని సందర్శించి వేద పండితుల ఆశీర్వాదాలు తీసుకొని అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు వడ్డనలు చేశారు పట్టణ శాంతి భద్రలతో పాటు ప్రజల్ని భగవంతుడు అన్నివేళలా కాపాడుతూ ఉండాలని ఈ సందర్భంగా కోరారు

## ఇచ్చిన హామీ అమలెప్పుడో చెప్పాలి: దుర్గం ప్రశాంత్



ఆసిఫాబాద్ జులై 2 ప్రజా జ్యోతి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జిల్లా బీజేపీ యువ నాయకుడు దుర్గం ప్రశాంత్ డిమాండ్ చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు 1 లక్ష ఆర్థిక సాయంతో పాటు ఒక తులం బంగారం అందిస్తామని ప్రకటించినప్పటికీ ప్రభుత్వం ఏర్పడి చాలాకాలం గడిచినా ఆ హామీ అమలు కాలేదని ఆయన విమర్శించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రభుత్వ హామీ అమలుపై ఆశతో ఎదురుచూస్తున్నాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు 1 లక్షతో పాటు ఒక తులం బంగారం ఎప్పటి నుంచి అందజేస్తారో ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని, ఆలస్యం చేయకుండా హామీలను అమలు చేయాలని దుర్గం ప్రశాంత్ కోరారు.

# కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ హామీలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీయాలి

**బీసీ హక్కుల అమలుకు బీఆర్ఎస్ ఉద్యమాలు చేపట్టాలి బీసీ సంఘాల విమర్శ**

**మాజీ మంత్రి హరీష్ రావుకు జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి వినతి**

**ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం**

**మంచిర్యాల, 2, జూలై (ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని బీఆర్ఎస్ శాసనసభ పక్ష ఉపనేత హరీష్ రావును జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి కోరింది. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తొలి అసెంబ్లీ సమావేశంలోనే చట్టబద్ధతతో మహాత్మ జ్యోతిబాపూలే పేరుతో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచి ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా వర్గీకరిస్తామని, ప్రభుత్వ టెండర్లు, సివిల్ మెయింటెనెన్స్ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అదేవిధంగా బీసీ కార్పొరేషన్ ఫెడరేషన్ల కింద నమోదైన ప్రతి సొసైటీకి ఎన్నికలు నిర్వహించడంతో పాటు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని, బీసీ విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఎలాంటి పూచీకత్తులు లేకుండా రూ.10 లక్షల రుణాలు అందిస్తామని, జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెడతామని, ఐదేళ్లలో బీసీల సంక్షేమానికి రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చి



మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసేలా బీఆర్ఎస్ పార్టీ పలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు కోరారు. ఈ కార్యక్రమం లో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షులు వడ్డేపల్లి మనోహర్, బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు మాచర్ల సదానందం, నాయకులు కంపరి వేణుగోపాల్, అంకం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల పోరాటాలతోనే హక్కులు సాధించుకుంటాం



పాలడుగు భాస్కర్, సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కనీస వేతనాల పెంపు అంటూ కార్మికులను మోసం చేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం

మంచిర్యాల జిల్లా విస్తృతస్థాయి సమావేశం

**మంచిర్యాల, 2, జూలై (ప్రజాజ్యోతి):** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) జిల్లా విస్తృ త స్థాయి సమావేశం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో జిల్లా అధ్యక్షులు అబ్బోజు రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులు తమ హక్కులను పోరాటాల ద్వారానే సాధించుకోగలరని, కార్మిక వర్గ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని ఆయన అన్నారు. దేశంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల వేతనాలు పెంచకుండా నిత్యావసర సరుకుల ధరలు, పుస్తకాల ధరలు, వైద్య ఖర్చులు, కూరగాయల ధరలు పెంచుతూ కార్మికులపై భారం మోపు తున్నాయని విమర్శించారు. కార్మికుల శ్రమను దోచుకుంటూ వారి జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. దేశంలో నరేం ద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటివరకు ఆ హామీల అమలులో విఫలమైందన్నారు. అనేక పరిశ్రమలు మూతపడే పరిస్థితులు ఏర్పడి కార్మికులు ఉపాధికి దూరమయ్యారని తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత రెండేళ్లలో ప్రజలకు, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైంద




న్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం మాత్రమే కాకుండా ఉపాధి అవకాశాలు కూడా కల్పించాలని సూచించారు. పనిచేసే మహిళా కార్మికులకు వారి శ్రమకు తగిన వేతనం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలపై జీవో ప్రకటించినప్పటికీ ఆ వేతనాలు ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, మధ్యాహ్న భోజన కార్మికులు, ఐకేపీ వీవోఏలు, హమాలీలు, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులు, మెడికల్ ప్రతినిధులు తదితరులకు వర్తించడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్మికులను అధికారికంగా కార్మికులుగా గుర్తించకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటోందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, గ్రామపంచాయతీ, ఐకేపీ వీవోఏలు, మున్సిపల్ మరియు ఇతర కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే ఉద్యమాలు, ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గోమాస ప్రకాష్‌ను జిల్లా ఉపాధ్యక్షుడిగా, దాగం రాజారాంను జిల్లా సహాయ కార్యదర్శిగా, సింగరేణి కాంట్రాక్టు కో–ఆప్షన్‌గా, ఎండి రఫియాను జిల్లా కమిటీ సభ్యురాలిగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పాలడుగు సుధాకర్ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, వెంకటస్వామి రాష్ట్ర నాయకులు, పైళ్ల ఆశయ్య రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్, దుంపల రంజిత్ కుమార్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి, సాంబరి వెంకటస్వామి, కాసర్ల రాజలింగు జిల్లా సహాయ కార్యదర్శులు, సమ్మక్క జిల్లా ఉపాధ్యక్షురాలు, జిల్లా కమిటీ సభ్యులు స్వాతి, లక్ష్మణ్, దేవదాస్, రమేష్, లీలారాణి తదితరులు, సీఐటీయూ అనుబంధ యూనియన్ల ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

# సింగరేణి అధికారుల పీఆర్‌పీ సమస్యను వెంటనే పరిష్కరించాలి





## సింగరేణి అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకం
## శ్రీరాంపూర్‌లో అధికారుల నిరాహార దీక్షకు సంఘీభావం
## తెలిపిన డాక్టర్ బి. జనక్ ప్రసాద్

**మంచిర్యాల, 2, జూలై (ప్రజాజ్యోతి):** సింగరేణి అధికారులకు సంబంధించిన పీఆర్‌పీ (పర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పే) నిలుపుదల సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ కోరారు. సింగరేణి వ్యాప్తంగా సీఎంఓఏఐ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతుగా గురువారం శ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి తన పూర్తి మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. జనక్ ప్రసాద్ మాట్లాడుతూ, సింగరేణి అధికారులకు సంబంధించిన న్యాయమైన సమస్యలను ప్రభుత్వం, సంస్థ యాజమాన్యం సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. అధికారుల పీఆర్‌పీ నిలుపుదల అంశాన్ని ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రధానంగా సింగరేణి అభివృద్ధిలో అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి రావాల్సిన న్యాయమైన ప్రయోజనాలను ఆలస్యం చేయకుండా వెంటనే అందించాలని ఆయన కోరారు. అధికారులకు పీఆర్‌పీ చెల్లించేందుకు ఎలాంటి సాంకేతిక, పరిపాలనా పరమైన ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. అధికారులు సంస్థ పురోగతికి నిరంతరం కృషి చేస్తున్న నేపథ్యంలో వారికి రావాల్సిన ప్రయోజనాలను నిలిపివేయడం సరైన విధానం కాదన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి అధికారుల సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగుల న్యాయమైన హక్కులను కాపాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు, కేంద్ర నాయకులు కలవేన శ్యామ్, రిక్కల గోపాల్ రెడ్డి, ఏంబడి తిరుపతి, మహేందర్ రెడ్డి, చందు మోహన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షంలోనూ నాలుగవ రోజు కొనసాగిన శ్రీరాంపూర్ ఏరియా అధికారుల రిలే నిరాహార దీక్షలు

**మంచిర్యాల, 2, జూలై (ప్రజాజ్యోతి):** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సింగరేణి అధికారుల ఆందోళనలు రోజు రోజుకు ఉధృతమవుతున్నాయి. శ్రీరాంపూర్ ఏరియాలో గురువారం నాలుగవ రోజు అధికారుల రిలే నిరాహార దీక్షలు భారీ వర్షం మధ్య కూడా కొనసాగాయి. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధికారులు దీక్షా శిబిరంలో పాల్గొని తమ ఐక్యతను చాటారు. నాలుగవ రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొంటున్న అధికారులకు వివిధ గనుల ఏజెంట్లు, మేనేజర్లు, ఇతర అధికారులు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. సీఎంఓఏఐ సింగరేణి బ్రాంచి పిలుపు మేరకు సింగరేణి వ్యాప్తంగా ఈ రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు .అధికారుల పే అప్‌గ్రేడేషన్, పీఆర్పీ చెల్లింపుతో పాటు ఇతర న్యాయమైన డిమాండ్లపై సింగరేణి యాజమాన్యం నుంచి స్పష్ట మైన హామీ వచ్చే వరకు తమ ఆందోళన కార్యక్రమాలు కొనసాగు తాయని నాయకులు స్పష్టం చేశారు. అవసరమైతే భవిష్యత్‌లో



ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జూలై 13 వరకు నిర్వహించే రిలే నిరాహార దీక్షల్లో పెద్ద సంఖ్యలో అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ప్రతి రోజు ఏరియా అధికారులు, వివిధ విభాగాల ప్రతినిధులు దీక్షా శిబిరానికి వచ్చి సంఘీభావం ప్రకటించాలని కోరారు.

## యూరియాపై అధిక ధరలు: అధికారుల చర్యలేవి?




**ఆసిఫాబాద్ జూలై 2 ప్రజా జ్యోతి** జిల్లాలో యూరియా అధిక ధరలపై వ్యవసాయ అధికారుల చర్యలు ఏవి అని, పరోక్షంగా ఎరువుల వ్యాపారులకు అధికారులు సహకరిస్తున్నారా అని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ ప్రశ్నించారు.వానాకాలం సీజన్ ప్రారంభమైన వేళ రైతులు యూరియా కోసం నానా అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం నిర్ణయించిన బస్తా ధర రూ.268 నుంచి రూ.270 మాత్రమే ఉండగా జిల్లాలో కొందరు వ్యాపారులు రూ.300 నుంచి రూ.350 వరకు వసూలు చేస్తున్నా రని ఆయన ఆరోపించారు. యాప్ బుకింగ్ పేరుతో కాలయాపన చేస్తూ, సర్వర్ లేదు, స్టాక్ లేదంటూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు.కొన్ని షాపుల యజమానులు యూరియాతో పాటు ఇతర మందులను లింకు పెట్టి అమ్ముతూ రైతులను దోచుకుంటున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. మండలాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా ఇప్పటివరకు తనిఖీలు జరగకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.వెంటనే జిల్లా కలెక్టర్, వ్యవసాయ అధికారులు స్పందించి ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## దస్తురా బాద్ పోలీస్ స్టేషన్లో వార్షిక తనిఖీ

### ఫిర్యాదుదారుల పట్ల సమన్వయంగా మెలగాలి
### జిల్లా ఎస్పీ డాక్టర్ జి జానకి




**ఖానాపూర్( దస్తురాబాద్ )జూలై 2 (ప్రజా జ్యోతి)** ఖానాపూర్ పోలీస్ సర్కిల్లోని దస్తురా బాద్ మండల పోలీస్ స్టేషన్లో నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిల గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్ను సందర్శించారు ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్ నిర్వహణ,శాంతి పద్ధతులను నేరాల దర్యాప్తు రికార్డులను పెండింగ్ కేసులపై పురోగతిని స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ సాయిరాం ని అడిగి తెలుసుకున్నారు స్టేషన్కు వచ్చి ఇచ్చే ఫిర్యాదుదారులతో సమన్వయంగా మెలిగి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా బాధ్యత గా విధులు నిర్వహించాలని అన్నారు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలతో పాటు నేరాలు దొంగతనాలు జరక్కుండా గస్తీ తిరిగి శాంతి పద్ధతుల పట్ల అప్రమత్తంగా ఉండాలని యువత మాదక మత్తు పదార్థాల జోలికి రాకుండా దేగ కన్నుతో పరిశీలించాలన్నారు ఆదేశించారు గ్రామాల్లో విలేజ్ పోలీస్ గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తులు ఎప్పటికప్పుడుస్టేషన్ కు వివరాలందించాలన్నారు ఈ కార్యక్రమంలో నిర్మల్ డిఎస్పి శ్రీనివాస్ ఖానాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కటకం సత్యనారాయణ ఎస్సై సాయిరాం పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## వైద్య దినోత్సవం సందర్భంగా డా నీలిమ వేణుగోపాలకృష్ణ దంపతులకు సన్మానం



**ఖానాపూర్ జూలై 2( ప్రజా జ్యోతి)** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ చెందిన ప్రముఖ వైద్యులు డా వేణుగోపాలకృష్ణ ఉత్తమ పురస్కారాలు పొందారు ఉన్నత సేవలందించి ...ఖానాపూర్, ఉట్నూర్, ఆదిలాబాద్ ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్ డా వేణుగోపాలకృష్ణ సేవలను గుర్తించి పలు జాతీయ రాష్ట్ర జిల్లా స్థాయి అవార్డులు అందుకున్నారు. ప్రేమతో నాన్న ..చిత్రాన్ని కళారంగంలో నంది పురస్కారాలనుకున్నారు ప్రస్తుతంనిజామాబాద్ వైద్య కళాశాలలో నూ ఎండీ వైద్య విద్యలో పేరు తెచ్చుకొని, రాష్ట్ర స్థాయి గౌరవం పొందారు.జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఐఎంఏ నిర్మల్ ఆధ్వర్యంలో జిల్లా డయాగ్నొస్టిక్ అసోసియేషన్ డా నీలిమ, డా వేణుగోపాలకృష్ణ దంపతులను ఘనంగా సన్మానించారు డిహెచ్ఎంఒ డా రాజేందర్, నిర్మల్ ఐఎంఏ చైర్మన్ డా "చక్రధర్ అధ్యక్షులు డా మురళీధర్, రాష్ట్ర సభ్యులు డా "దామోర రాములు, డా" రమేష్, డా "రవి ఎన్ డి ఏ సభ్యులు సంతోష్ ,నేరెళ్ల హనుమంతు, నీలిమ హాస్పిటల్ సిబ్బంది ఉదయ్, విఠల్ మహేష్ రాము,గీత తదితరులు పాల్గొని డా నీలిమ వేణుగోపాలకృష్ణ లను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## సింగరేణి అధికారుల పీఆర్పీ నిలుపుదలను వెంటనే ఎత్తివేయాలి

రిలే నిరాహార దీక్షకు తెలంగాణ బొగ్గుగని కార్మిక సమాఖ్య సంఘీభావం



జైపూర్ జూలై 2 ప్రజా జ్యోతి సింగరేణి అధికారులకు సంబంధించిన పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్పీ) నిలుపుదలను తక్షణమే ఎత్తివేసి, బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సమాఖ్య వ్యవస్థాపక కన్వీనర్ కేంగర్ల మల్లన్న ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. జైపూర్ ఏరియాలోని ఎస్టీపీపీ (సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్)లో సింగరేణి అధికారుల సంఘం (సీఎంఓఏఐ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షకు గురువారం ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం అధికారులు ప్రతిరోజూ 12 నుంచి 14 గంటల పాటు అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని, అలాంటి అధికారుల ను తమ న్యాయమైన హక్కుల కోసం రోడ్డెక్కే పరిస్థితి కల్పించడం బాధాకరమని అన్నారు.అధికారులకు రావాల్సిన పీఆర్పీ బకాయిలతో పాటు ఇతర న్యాయమైన డిమాండ్లను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని అధికారుల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాగుల మోహన్‌రావు, దొడ్డ సతీష్, బండి రవీంద్ర తదితరులు పాల్గొని అధికారుల ఉద్యమానికి మద్దతు తెలిపారు.

## వర్షం పడితే విద్యుత్ సరఫరా బంద్.. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం




ఆసిఫాబాద్, జులై 2 ప్రజా జ్యోతి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గుండి గ్రామంలో వర్షం పడితే చాలు విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షానికే గంటల తరబడి కరెంట్ లేకపోవడంతో విద్యార్థుల చదువులు, తాగునీటి సరఫరా, గృహ అవసరాలు, చిన్న వ్యాపారాలు దెబ్బతింటున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్య చాలా కాలంగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత పరిస్థితి మరింత తీవ్రంగా మారిందని, ప్రతి వర్షానికీ విద్యుత్ సరఫరా నిలిచిపోవడం సాధారణంగా మారిందని తెలిపారు.గ్రామంలోని విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను సమగ్రంగా పరిశీలించి లోపాలను వెంటనే సరిదిద్దాలని, గుండి గ్రామానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందేలా విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

# సీఎంఓఏఐ అధికారుల రిలే నిరాహార దీక్షలకు హెచ్ఎంఎస్ యూనియన్ సంఘీభావం

### పీఆర్‌సీ ,కోల్ ఇండియా తరహాలో ప్రమోషన్ పాలసీ లను అమలు చేయాలి



మంచిర్యాల, 2, జూలై (ప్రజాజ్యోతి): సింగరేణి అధికారుల సమస్యల పరిష్కారం కోసం సీఎంఓఏఐ అధికారుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు . గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఈ నిరాహార దీక్షలో భాగంగా హెచ్ఎంఎస్ యూనియన్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ పతెం రాజబాబు ఆధ్వర్యంలో నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ నాయకులు మాట్లాడుతూ, సింగరేణి అధికారుల న్యాయమైన సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని కోరారు. అధికారులకు పీఆర్‌సీని తక్షణమే అమలు చేయడంతో పాటు, సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కోల్ ఇండియాలో అమలవుతున్న విధానాల మాదిరిగా సింగరేణిలో కూడా ప్రమోషన్ పాలసీని అమలు చేయాలని కోరారు. అధికారుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ఈ రిలే నిరాహార దీక్షలకు అన్ని కార్మిక, ఉద్యోగ సంఘాలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కొనసాగిస్తే ఆందోళనలు మరింత ఉధృతం అయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఏరియా కమిటీ నాయకులు బాలేష్, శోభన్, శ్రీనివాస్, ఏరియా కార్యదర్శి ఆవుల రాజశేఖర్ తదితరులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

# నేడు, రేపు నీటి సరఫరా బంద్

మంచిర్యాల పట్టణంలో వాటర్ ట్యాంకు మరమ్మతుల కారణంగా నీటి సరఫరా నిలిపివేత

మంచిర్యాల నగర పాలక సంస్థ కమిషనర్




మంచిర్యాల, జూలై 2: మంచిర్యాల పట్టణ ప్రజలకు త్రాగునీటి సరఫరా అందించే వాటర్ ట్యాంకు వద్ద మరమ్మతుల పనులు చేపడుతున్న నేపథ్యంలో మంచిర్యాల నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ గురువారం తెలిపారు.జి.టి.ఆర్ పైప్‌లైన్‌కు సంబంధించిన సాంకేతిక పనులు, మరమ్మతులు చేపడుతున్న కారణంగా మంచిర్యాల పట్టణానికి 3 అలాగే మరియు 4 తేదీల్లో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రజలు ముందస్తుగా తగినంత నీటిని నిల్వ చేసుకోవాలని, తాత్కాలిక అసౌకర్యాన్ని సహకార భావంతో అర్థం చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు వేయకపోతే జాతీయ రహదారిపై ధర్నా: డీవైఎఫ్ఐ



ఆసిఫాబాద్, జూలై 2: ప్రజా జ్యోతి కొమురంభీం ఆసిఫాబాద్ రెబ్బెన మండలం కొండపల్లి గ్రామానికి 20 ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం విమర్శించారు. ప్రభుత్వాలు మారినా గ్రామ సమస్య మాత్రం పరిష్కారం కాలేదన్నారు. వర్షాకాలంలో విద్యార్థులు బురదలో నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సైతం గ్రామంలోకి చేరలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కిలోమీటరు రోడ్డు నిర్మించలేకపోవడం ప్రభుత్వాల వైఫల్యమని విమర్శించారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొండపల్లికి పక్కా రోడ్డు నిర్మించాలని, లేకపోతే గ్రామస్తులతో కలిసి జాతీయ రహదారిపై ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు చాపిడి శివ, మండల నాయకుడు డోంగ్రి గజానంద్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి



తాండూర్ జూలై 2 ప్రజా జ్యోతి తాండూర్ మండలం రేపల్లెవాడ సమీపంలోని జాతీయ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదంలో కోట భూదేవి (70 ) అనే వృద్ధు రాలు మృతి చెందినట్లు తాండూర్ ఏఎస్ రాజా మొగిలి తెలిపారు. ఆయన కథనం ప్రకారం భూదేవి అనే వృద్ధురాలు తన కుమారుడు శంకర్ ఇంటికి వెళ్లి ఆమె స్వగృహం వైపు వస్తుండగా రోడ్డు డివైడర్ దాటుతుండగా చంద్రాపూర్ నుండి బెల్లంపల్లి వైపు వెళ్తున్న లారీ వేగంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు. రెండు కాళ్లు ,నడుము భాగం పూర్తిగా నుజ్జు నుజ్జు కావడంతో వెంటనే స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడం తో కుటుంబీకులు ఆమెను మంచిరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గ మధ్యంలోనే ఆమె మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించడం జరిగిందన్నారు. మృతదేహాన్ని శవ పంచనామా కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడం జరిగిందని ఆమె కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని ఏఎస్ఐ తెలిపారు.

## రైతులకు ఉచిత పత్తి విత్తనాలు పంపిణీ



**తాండూర్ జూలై 2 (ప్రజాజ్యోతి)** కపాస్ క్రాంతి పథకం కింద ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పత్తి విత్తనాలను బుధవారం వ్యవసాయ అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ అధిక సాంద్రత పద్దతిలో పత్తి సాగు ను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం కపాస్ క్రాంతి పథకం ద్వారా రైతులకు ఉచితంగా విత్తనాల పంపిణీ చేస్తుందని తెలిపారు. తాండూరు మండలంలో 219 హెక్టార్లలో అధిక సాంద్ర పద్దతిలో పత్తి సాగు ను ప్రోత్సహిస్తుందని తెలిపారు. బుధవారం 30 మంది రైతులకు ఉచిత విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎంపిక చేసిన రైతులకు వ్యవసాయ శాఖ సాగులో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు సాగు పద్ధతుల పై అవగాహన కల్పిస్తుందని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేష్ కిష్టంపేట ఏఈఓ రాకేష్ రేచిని ఏఈవో మౌనిక రైతులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్

-దుర్వ్యసనాలకు బానిసలై
-మద్యం మత్తులో చోరీ
-3 వేల నగదు స్వాధీనం
-బోథ్, సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. గురుస్వామి



**బోథ్,జూలై 2 (ప్రజా జ్యోతి)**దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి నగదును స్వాధీన పరుచుకున్నట్లుగా సిఐ.డి గురుస్వామి శుక్రవారం పేర్కొన్నారు. ఆయన వివరాల ప్రకారం మండలంలోని సాయి నగర్ కాలనీకి చెందిన షేక్ ముబీనా ఆలం అనే వ్యక్తి ఇంటిలో గత నెల 28న చోరీ జరిగినట్లుగా పేర్కొన్నారు. బాధితుడు తన ఇంటికి తాళం వేసి ఉదయం ఎప్పటి మాదిరిగానే దుకాణానికి వెళ్లి రాత్రి తిరిగి వచ్చేసరికి తన ఇంటిలోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండడంతో దొంగతనం జరిగినట్లుగా గుర్తించారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లుగా తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్సై పురుషోత్తం తమ సిబ్బందితో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించిన పిదప పలు సాంకేతిక ఆధారాలు ఇతర సమాచారం ఆధారంగా అదే కాలనీకి చెందిన ఇప్ప పరమేశ్వర్, ద్యారంగా పోశెట్టి అనే వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లుగా తెలిపారు. ముఖ్యంగా నిందితుల నుంచి పూర్తిస్థాయిలో నగదును స్వాధీన పరుచుకున్నట్లుగా తెలిపారు. అనంతరం సిఐ మాట్లాడుతూ దుర్వ్యసనాలకు బానిసలై జల్సాలకు అలవాటు పడి మద్యం మత్తులో దొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా పేర్కొన్నారు. అలాగే ప్రజలు ఇండ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే క్రమంలో పూర్తిస్థాయిలో తగు జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. ఒకవేళ అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పురుషోత్తం, హెడ్ కానిస్టేబుల్ గంగా ప్రసాద్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ జేఏసీ ఆధ్వర్యంలో కాలేజీల బంద్

### విద్యార్థుల భవిష్యత్తో ఆటలొద్దు: రమేష్ రూపునర్



**ఆసిఫాబాద్ జూలై 2 ప్రజా జ్యోతి** పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలన్నీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గురువారం కాలేజీల బంద్ నిర్వహించారు. రాష్ట్ర బీసీ జేఏసీ, జాతీయ బీసీ జేఏసీ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ రూపునర్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లోబడే లహు కుమార్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి కిరణ్ల ఆధ్వర్యంలో ఈ బంద్ జరిగింది. పట్టణంలోని పలు ఇంటర్, డిగ్రీ కాలేజీలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా రమేష్ రూపునర్ మాట్లాడుతూ.. పాత పద్ధతిలోనే ఫీజు రీయింబర్స్మెంట్ విధానాన్ని అమలు చేయాలని, గత నాలుగేళ్లుగా పెండింగ్లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల చదువులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, రాష్ట్రంలో 14 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ చేయకపోవడంతో 9 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లలో 12 లక్షల కోట్ల బడ్జెట్, అప్పుగా తెచ్చిన 4 లక్షల కోట్లలో కనీసం వెయ్యి కోట్లు కూడా ఫీజు రీయింబర్స్మెంట్కు కేటాయించలేదని విమర్శించారు. పెద్ద కాంట్రాక్టర్ల బిల్లులకు 70 వేల కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం కేవలం 7 వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. బకాయిలు వెంటనే విడుదల చేయకపోతే ఈనెల 15న హైదరాబాద్లో ధర్నా, రాస్తారోకో చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షుడు బొట్టుపల్లి ప్రశాంత్, మండల అధ్యక్షుడు సిరికొండ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్లో ప్రత్యేక సర్వే కార్యక్రమం.



**తాండూర్ జూలై 2 (ప్రజాజ్యోతి)** తాండూర్ మండలంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయిలో ఓటరు జాబితా పరిశీలన, దరఖాస్తుల స్వీకరణ, పత్రాల ధృవీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజల నుంచి అవసరమైన వివరాలు, ధ్రువపత్రాలను స్వీకరించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను చేపట్టారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ సూపర్వైజర్ ఆఫీసర్ తాండూర్ బి. పద్మజ, కంప్యూటర్ ఆపరేటర్ దాసరి మహేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి. ఈసా, తాండూర్ యూత్ ప్రెసిడెంట్ పెట్టెం విష్ణుకళ్యాణ్, జిల్లా యూత్ సెక్రటరీ ఎండి. జుబేర్, దీకాలు విజయలక్ష్మి, సుజాత, దీకాా అబ్దుల్ రెహమాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు...

# బాసర మహంకాళి ఆలయ చోరీ కేసు ఛేదించిన పోలీసులు

**ఇద్దరు అంతర్జిల్లా దొంగలు సహా ముగ్గురి అరెస్ట్.**
**.వెండి కిరీటం, నగదు స్వాధీనం**



**బాసర జూలై 2 (ప్రజా జ్యోతి):** నిర్మల్ జిల్లా బాసరలోని ప్రసిద్ధ ఆలయ పరిధిలో ఉన్న మహంకాళి అమ్మవారి ఉపాలయంలో ఇటీవల జరిగిన చోరీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు అంతర్జిల్లా దొంగలతో పాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేసి, దొంగిలించిన వెండి కిరీటం, వెండి పట్టి, నగదు, మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ జానకి షర్మిల కేసు వివరాలను వెల్లడించారు. గత నెల 22వ తేదీ రాత్రి మహంకాళి ఆలయ తాళాలు పగులగొట్టి, అమ్మవారి వెండి కిరీటంతో పాటు హుండీలోని నగదును దుండగులు అపహరించిన విషయం తెలిసిందే. ఈ ఘటనను సవాలుగా తీసుకున్న పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కేవలం పది రోజుల్లోనే నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల నిందితులను, చోరీకి గురైన సొత్తును ప్రదర్శించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... జూన్ 22న బాసర అమ్మవారి ఆలయంలో చోరీ జరిగింది. ఆ వెంటనే దొంగతనాన్ని ఛేదించేందుకు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ తోబాటు మహారాష్ట్రలో గాలింపు చర్యలు చేపట్టినట్లు, గుళ్ళలో చోరీ చేసే పాత నేరస్తుల వివరాల మేరకు నిందితులను గుర్తించినట్లు, సాంకేతికత సహాయంతో వారిని గుర్తించి రైలులో ప్రయాణిస్తుండగా బాసర వద్ద అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గుంటూరుకు చెందిన ఏడుకొండలు, నిజామాబాద్ కు చెందిన రామకృష్ణ ఇద్దరు కలిసి పథకం వేసుకొని ఆలయంలో చోరీ చేసి 1.220 కిలోల అమ్మవారి వెండి కిరీటంతో పాటు, 260 గ్రాముల వెండి పట్టి, హుండీ నుండి 16 వేల రూపాయలు దొంగతనం చేశారు. వీరు చోరీ చేసిన సొత్తును కొడమ ఆనంద్ తన వద్ద దాచి, నాందేడ్ లో అమ్మాల్సిందిగా తెలిపాడు. నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు, వీరి నుండి అమ్మ వారి కిరీటం, వెండి పట్టి తోబాటు ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అత్యంత చాకచక్యంగా కేవలం 10 రోజుల్లోనే కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రధానంగా రైల్వే సౌకర్యం ఉన్న ఆలయాలనే లక్ష్యంగా చేసుకుని ఈ ముఠా చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైందని ఆమె పేర్కొన్నారు. ఈ కేసును వేగంగా ఛేదించిన ముధోల్ సీఐ రవీందర్ నాయక్, బాసర ఎస్హెచ్వో దీపక్, కానిస్టేబుళ్లు భీమేష్, రవతోళ్ల మోహన్తో పాటు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని జిల్లా అదనపు ఎస్పీ జానకి షర్మిల అభినందించారు

## భగత్‌సింగ్‌నగర్‌లో వృద్ధురాలి ఆత్మహత్య



**రామకృష్ణాపూర్,జులై 2(ప్రజా జ్యోతి):** రామకృష్ణాపూర్ పట్టణం లోని భగత్‌సింగ్‌నగర్‌లో 71 ఏళ్ల వృద్ధురాలు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భగత్‌సింగ్ నగర్‌కు చెందిన షరీఫాబీ తన ఇంట్లోని గదిలో ఇనుప పైపుకు చున్నీతో ఉరివేసుకుని మృతిచెందింది. మృతురాలి కుమారుడు సయ్యద్ బాబా ఇచ్చిన ఫిర్యాదు మేరకు, రెండేళ్ల క్రితం ఆమె భర్త అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నప్పటి నుంచి షరీఫాబీ తీవ్ర మనోవేదనకు గురై ఒంటరిగా మాట్లాడుకుంటూ ఉండేదని పేర్కొన్నారు. గురువారం తెల్లవారుజామున గదిలో ఉరివేసుకుని కనిపించడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామకృష్ణాపూర్ పట్టణ ఎస్సై శ్రీధర్ తెలిపారు.

## ఎమ్మెల్యే కృషితో బెల్లూరి కి ఆర్టిసి బస్సు

హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు




**ఆదిలాబాద్ టౌన్,జూలై 2( ప్రజా జ్యోతి )**అదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం బెల్లూరి గ్రామానికి చాలా రోజుల తర్వాత ఆర్టీసీ బస్సు గురువారం పునర్ ప్రారంభమైంది. అదిలాబాద్ డిపో బస్టాండ్ నుండి బెల్లూరి గ్రామానికి ఉదయం సాయంత్రం రెండు సార్లు వస్తుంది. గ్రామ సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతు బెల్లూరి గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే పాయల్ శంకర్ కు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే గ్రామానికి ఆర్టిసి బస్సు రావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచుకు అభినందనలు తెలిపారు.

## బాసర ఆలయ హుండీ ఆదాయం కోటి



**బాసర జూలై 2(ప్రజా జ్యోతి),** బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను గురువారం ఆలయంలోని సాధారణ అక్షరాభ్యాస మండపంలో ఆలయ ఈవో అంజనీదేవి, ఆలయ సిబ్బంది పోలీసుల సమక్షంలో లెక్కింపు నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయానికి ఒక కోటి ఆరు లక్షల నలభై ఐదు వేల మూడు వందల యాభై తొమ్మిది రూపాయలు (1,06,45,359/–) మిశ్రమ బంగారం 78 గ్రాములు, మిశ్రమ వెండి 04 కిలోలు, విదేశీ కరెన్సీ 17 నోట్లు లభించాయని ఈ ఆదాయం ఆలయానికి 49 రోజుల్లో సమకూరినట్లు ఆలయ ఈవో తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ నిర్మల్ పరిశీలకులు ఆర్.రవికిషన్, ఏ ఈ ఓ గంగా శ్రీనివాస్, పర్యవేక్షకులు శివరాజ్, సంజీవ్ రావు దేవస్థాన పరిపాలన,వైదిక సిబ్బంది, టి జి బి బ్యాంక్ సిబ్బంది, దేవస్థాన హోం గార్డ్స్, వాగ్దేవి సొసైటి సభ్యులు, శ్రీ రాజరాజేశ్వర స్వామి సేవా సమితి, రాజన్న సిరిసిల్లా, నిర్మల్, నిజామాబాదు జిల్లా సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్‌పీ-3 గనిలో భద్రతపై సమీక్ష సమావేశం

### ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

### ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్





**మంచిర్యాల,2, జూలై (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పీ–3 గనిలో భద్రతా చర్యలపై గురువారం సమీక్షా సమావేశంను నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్‌తో కలిసి గనిని సందర్శించి అధికారులు, సూపర్వైజర్లు, మైనింగ్ సిబ్బందితో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా గనిలో ఇటీవల చోటుచేసు కున్న ప్రమాదాలపై వివరాలు సేకరించారు. భవిష్యత్తులో ప్రమాదాలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన వ్యూహాలపై అవగాహన కల్పించారు. వరుసగా ప్రమాదాలు జరగడం గనికి మాత్రమే కాకుండా మొత్తం శ్రీరాంపూర్ ఏరియాకు శ్రేయస్కరం కాదని ఆయన అన్నారు. ఉత్పత్తి కంటే కార్మికుల భద్రతే అత్యంత ముఖ్యమని, ప్రతి ఒక్కరూ ఎస్ఓపీ, ఎస్ఓఎం నిబంధనలకు కట్టుబడి విధులు నిర్వహించాలని సూచించారు. గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని మళ్లీ అవి పునరావృతం కాకుండా ఎస్ఓపీలు, ఎస్ఓఎంలు రూపొందించారని గుర్తు చేశారు. వాటిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పని ప్రదేశాలను ఒకటికి రెండుసార్లు పరిశీలించిన తర్వాతే పనులు ప్రారంభించాలని, గోరంత నిర్లక్ష్యం కూడా కొండంత ప్రమాదానికి కారణమ వుతుందని హెచ్చరించారు. అవసరమైతే అదనపు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాల కారణంగా శ్రీరాంపూర్ ఏరియాలో అత్యధిక ఆయుష్షు కలిగిన ఎస్ఆర్‌పీ–3 గని ఉనికికే ముప్పు వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్ మాట్లాడుతూ, నిరంతరం భద్రతా సూత్రాలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ ప్రమాదాలు చోటుచేసు కోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. "జీరో హామ్" స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ నిబద్ధతతో విధులు నిర్వహించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ గ్రూప్ ఏజెంట్ రవికుమార్, గని మేనేజర్ వెంకట్‌రావు, రక్షణ అధికారి మహేందర్‌తో పాటు ఇతర అధికారులు, సూపర్వైజర్లు, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశానికి వెన్నెముకగా పరిశ్రమలు పరిశ్రమలకు వెన్నెముకగా ఐటీఐ విద్యార్థులు





**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**నైపుణ్యంతో కూడిన సాంకేతి క విద్యే ఉన్నత ఉద్యోగాలకు బాట**

**అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో--2026ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ**

**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 2 (ప్రజా జ్యోతి)** దేశానికి వెన్నెముక గా పరిశ్ర మలు నిలుస్తున్నాయి అని, పరిశ్రమలకు వెన్నుముక గా ఐటిఐ విద్యార్థులు నిలుస్తు న్నారని, నైపుణ్యంతో కూడిన విద్యే ఉన్నత ఉద్యోగాలకు బాట వేస్తుందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ స్పష్టం చేశారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లో నిర్వహించిన ప్రాజెక్ట్ ఎక్స్ పో--2026 కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ ముఖ్యఅతిథిగా హాజరై ఎక్స్‌పోను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా విద్యా ర్థులు రూపొందించిన ఇంజినీరింగ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, సీ ఎన్ సీ మెషిన్ మెకానిక్, వ ర్చువల్ అనాలిసిస్ విభాగా లతో పాటు ఎలక్ట్రిషియన్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (సిఓపి ఎ), డ్రెస్ మేకింగ్, స్టెనోగ్రఫీ త దితర ట్రేడ్లకు చెందిన ప్రాజెక్టులను జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకొని వారి ప్రతిభను అభి నందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, దేశ ఆర్థికాభివృద్ధికి పరిశ్రమలు వెన్నెముక వంటివని, ఆ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడంలో ఐటీఐ కోర్సులు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం రోజురో జుకూ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు 3ఐ టెక్నాలజీ, అడ్వా న్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్ (ఏఐ) ఆధారిత టెక్నాల జీలు వంటి ఆధునిక అంశాల్లో నైపుణ్యం పెంపొందించుకొని దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చు కోవాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రతి ప్రాజెక్టు వినూత్న ఆలోచనలతో, సాంకేతిక నైపుణ్యంతో రూపొందించబడిందని ప్రశంసిస్తూ, ఇలాంటి ప్రాజెక్టులు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, మావల సీఐ బి.డి. ప్రేమ్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ విద్యార్థి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి





.బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**బజార్హత్నూర్, జూలై 02( ప్రజాజ్యోతి)** బజార్హత్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన "ఆరోగ్య పాఠశాల" కార్యక్రమాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా తో కలిసి ఘనంగా ప్రారంభించారు. విద్యార్థులు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పోషకాహారం తీసుకోవడం, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా పోక్సో క్యాలెండర్ మరియు యాంటీ డ్రగ్స్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటేనే వారు విద్యలోనూ రాణిస్తారని అన్నారు. ప్రతి విద్యార్థి పరిశుభ్రత, సమతుల ఆహారం, క్రమం తప్పని వ్యాయామాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందితో కలిసి కార్యక్రమ నిర్వహణపై సమీక్షించి, విద్యార్థులకు అవసరమైన ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వైద్యశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జ్యోతిబాపులే పాఠశాలను సందర్శించిన మార్కెట్ కమిటీ చైర్మన్

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి: ఇరుకుల మంగ

**ఆసిఫాబాద్ జులై 2 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం లోని స్థానిక జ్యోతిబాపులే పాఠశాలను బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, డైరెక్టర్ మారుతి పటేల్, నాయకులు గాజుల జక్కన్న విశ్వనాథ్ సందర్శించారు. పాఠశాల ప్రాంగణంలోకి చేరుకున్న వీరికి యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు స్వాగతం పలికారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యాబోధన తీరు, మౌలిక వసతులు, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల క్రమశిక్షణ, యూనిఫాం, హాజరు శాతం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందిస్తూ, మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్న యాజమాన్యాన్ని, ఉపాధ్యాయ బృందాన్ని చైర్మన్ ఇరుకుల మంగ



అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యాసన నైపుణ్యాల పెంపునకు అధ్యాపకులు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 2 (ప్రజా జ్యోతి)**విద్యార్థులలో అభ్యాసన సా మర్థ్యాలను పెంపొందించేం దుకు, తరగతి గదుల్లో వారిని క్రియాశీలకంగా ఉంచేందుకు అధ్యాపకులు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక జిల్లా ఇంటర్మీడియేట్ కార్యాలయంలో ఫిజిక్స్ లెక్చరర్లకు నిర్వహించిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేవలం సిలబస్ పూర్తి చేయడం మాత్రమే కాకుండా, విద్యార్థులకు సబ్జె క్టులపై స్పష్టత వచ్చేలా బోధ నా పద్ధతులలో మార్పులు తీసుకురావాలని సూచించారు. ఇంగ్లీష్ మీడియం విద్యా ర్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడంతో పాటు, అధ్యా పకులు తమ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగు పరుచుకోవాలని సూచించారు. కళాశాలల్లో నూతన పాఠ్యపుస్తకాల లభ్యతను పరిశీలించి, ఎక్కడైనా కొరత ఉంటే వెంటనే ప్రి న్సిపాల్, డి.ఐ.ఈ.ఓ ల దృష్టికి తీసుకువెళ్లి ని వారించాల న్నారు. సైన్స్ సబ్జెక్టులలో ఇం టరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వినియోగాన్ని పెంచాలని, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారాల భించే విద్యా విషయాలను తరగతి గదుల్లో ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని అంచనా వేసేందుకు ప్రతిరోజూ హోంవర్క్ ఇవ్వాలని, తరగతిలో వెనుకబ డిన లేదా 'టీచర్ సపోర్టెడ్' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధవహించాలని స్పష్టం



చేశారు. వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు తొలుత సులువైన ప్రశ్నలు, ఆపై మధ్యస్థ, కఠినమైన ప్రశ్నలతో సాధన చేయించాల న్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో కీలక మైనందున, ప్రతీ విద్యార్థి ఉ త్తీర్ణత సాధించేలా నెలవారీ సమీక్షలు, ఈ విద్యాసంవత్సరంలో 3 లేదా 4 కాంప్లెక్స్ స మావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడి యేట్ విద్యాశాఖ అధికారి జా దవ్ గణేష్ కుమార్, జిల్లా అకడమిక్ కమిటీ సభ్యులు సూరజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమా కాంత్, తిరుపతి, వివిధ కళా శాలల ప్రిన్సిపాల్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఇతర జూనియర్ లెక్చరర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొ న్నారు.

## లక్ష్యానికి మించి ఆయిల్ పామ్ పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రావెల్లడి



**ఖానాపూర్ జూలై 2( ప్రజా జ్యోతి)నిర్మల్** జిల్లాలో లక్ష్యానికి మిం చి ఆయిల్ పామ్ పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఆయిల్ పామ్ పంటల విస్తీర్ణం పెంపుదలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో నిర్దేశించి న 1600 ఎకరాలకు మించి ఆయిల్ పామ్ పంటలను సాగు చేసేలా చొరవ చూపాలన్నారు. ఆ విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు మిగతా పంటలకు, ఆయిల్ పామ్ పంటలు పండిస్తే కలిగే ప్రయోజనాల మధ్య వ్యత్యాసాలను వివరించాలన్నారు. పెట్టుబడి, శ్రమ, సాగునీరు, రాబడి వంటి లాభాలను రైతులకు తెలియజేయాలన్నారు. హార్టికల్చర్, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సాగు విస్తీర్ణాన్ని పెంచాలని వివరించారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటల సాగును ప్రోత్సహిస్తుందని అన్నారు. మండలాల వారిగా వ్యవసాయ శాఖ అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, వ్యవసాయ, హార్టి కల్చర్ అధికారులు అంజిప్రసాద్, రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గోండి బాషా అభివృద్ధికి కృషి చేయాలి

-ఏ పి ఓ ఆత్రం భాస్కర్



**బోథ్, జూలై 2 (ప్రజా జ్యోతి)** బోథ్ మండలంలోని పట్నాపూర్ రాయిసెంటర్ పరిధిలో నిర్వహించిన సమావేశనికి ముఖ్య అతిథి గా ఐటిడిఏ ఏపిఓ ఆత్రం భాస్కర్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐటిడిఏ పి ఓ ఉట్నూర్ ఆదేశాల మేరకు మొదటి సమావేశమును గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తున్న ట్లుగా తెలిపారు. దీని ముఖ్య ఉద్దేశ్యం అంతరించి పోతున్న గోండి బాషా ను పరిరక్షణ కు ప్రతి ఒక్క గిరి పుత్రులు పాటుపడాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా భవిష్యత్తు తరాలకు అందించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. గ్రామనికి 5 గురు చొప్పున యూత్ సభ్యులతోబృందాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక యాప్ ద్వారా సుమారు ఇరవై వేల పదాలు రూపొందించి పుస్తకం రూపంలో ప్రచురించి ప్రజలకు అందుబాటులో ఉంచడం దీన్ని ఉద్దేశ్యం అని, వైటిసి ద్వారా జరిగే ట్రైనింగ్ సెంటర్ లను యువత సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులను పాఠశాలకు పంపేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని గ్రామస్తులను కోరా రు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పంద్రం సుగుణ సర్మేడి ఆడేం భీంరావ్ న్యాయవాది పంద్రం శంకర్ ఉప సర్పంచ్ ఆత్రం మోహన్ పటేల్ తోడషం నిలకాంత్ రావ్ మాజీ సర్పంచ్ తోడషం గోపాల్ ప్రధానోపాధ్యాయులు శేఖర్ మండాడి నాగోరావ్ తోడషం దేవరావు జైతు కైలాష్ జంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన ఆదివాసి, గిరిజన ప్రజాప్రతినిధుల బృందం

### అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతి

### సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి

**ఖానాపూర్ జూలై 2(ప్రజా జ్యోతి)** గిరిజన ఆదివాసి నియోజకవర్గాల ప్రాతినిధ్య వహిస్తున్న ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక నిధులతో పాటు ప్రత్యేక అభివృద్ధి సదుపాయ సౌకర్యాలకు కేటాయించాలంటూ హైదరాబాద్ సచివాలయంలో మంత్రిదనసరి సీతక్క నేతృత్వంలో ఆదివాసి, గిరిజన ప్రజాప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా గురువారం కలిసి ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంత నియోజకవర్గాలకు అదనంగా 2,వెల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని, పోడు భూములకు పట్టాలు మంజూరు చేయడంతో పాటు ఇందిర గిరి జల వికాసం పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు అదేవిధంగా ఉట్నూర్, భద్రాచలం బీఈడ్ కళాశాలల్లో టీచింగ్, నాన్-టీచింగ్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, గిరిజన క్రీడా ఆశ్రమ పాఠశాలలను ఇంటర్ స్థాయి వరకు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఐటీడీఏలను మరింత బలోపేతం చేయడంతో పాటు, జీవో నంబర్--3కు ప్రత్యామ్నాయంగా కొత్త జీవో తీసుకువచ్చి ఐటీడీఏ పరిధిలోని ఖాళీలను భర్తీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతులను



సానుకూలంగా స్వీకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐటీడీఏ పరిధిలో సాచురేషన్ విధానంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కృషి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి సీతక్క మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మంత్రి అజారుద్దీన్ నిర్మల్ డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలి

### జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా వ్యాప్తంగా పోలీస్ అక్క, షీటీం సిబ్బందితో సమీక్ష స మావేశం

### జూన్ నెలలో షీటీం తో 90 ఫిర్యాదుల పరిష్కారం 157 హాట్‌స్పాట్లలో ప్రత్యేక నిఘా

### 87 మంది ఆకతాయిలు రెడ్ హ్యాండెడ్ 52 పెట్టి కేసులు, 1 ఎఫ్ఐఆర్ నమోదు

### ఒక బాల్య వివాహాన్ని అడ్డుకున్న షీటీం 76 అవగాహన కార్యక్రమాలు, 48 గ్రామాల సందర్శన,

### వారంలో మూడు పాఠశాలల ను, మూడు గ్రామాలను సందర్శించి మహిళల సమస్యలను తెలుసుకోవాలి





**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 2, (ప్రజా జ్యోతి)** మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజ న్ ఐపీఎస్ సూచించారు. గురువారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లావ్యా ప్తంగా పనిచేస్తున్న పోలీస్ అక్క, షీ టీం సిబ్బందితో సమా వేశం ఏర్పాటుచేసి, సర్కిల్ ఇన్స్పెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం చేపట్టారు. మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, బాల్య వివాహాల నివారణలో మరింత అప్రమ త్తంగా పనిచేయాలని, ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జూన్ నెలలో షీ టీం చేపట్టిన కార్యక్రమాల వివరాలను వె ల్లడించారు. జూన్ నెలలో జిల్లాలో మొత్తం 90 పిటిషన్లు అందగా, వాటిపై సత్వర చర్యలు చేపట్టారు. మహిళలు, బాలికలను వేధింపులకు గురి చేస్తున్న 87 మంది ఆకతా యిలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టు కున్నారు. వీరిలో 50 మం దిపై పెట్టి కేసులు నమోదు చేయగా, 37 మందికి కౌన్సిలింగ్ నిర్వహించారు. అదనంగా 2 ఈ-పెట్టి కేసులతో కలిపి మొ త్తం 52 పెట్టి కేసులు, 1 ఎఫ్ ఐ ఆర్ నమోదు చేశారు. ఒక బాల్య వివాహాన్ని అడ్డుకొని, సంబంధిత కుటుంబాలకు చట్టపరమైన అవగాహన క ల్పించారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, మహిళల హక్కులపై 76 అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, 48 గ్రామాలను సందర్శించి ప్రజల్లో చైతన్యం కల్పించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విద్యాసంస్థలు తదితర ప్రాంతాల్లో 157 హాట్‌స్పా ట్లలో ప్రత్యేక నిఘా నిర్వహించారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే డయల్-100 లేదా 871265 9953 నంబర్ ద్వారా ఆదిలాబాద్ షీ టీంను సంప్రదించా లని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రత కోసం జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ప్రతిభ కనబరిచిన ఐదుగురు పోలీసు అక్క, షీ టీం సిబ్బందికి ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు. మహిళలకు దగ్గరై, వారికి సరైన సమయంలో న్యాయం చేసి, సమాజంలో పోలీసు కీర్తి ప్రతిష్టలు పెరిగేలా విధుల నిర్వహణచే పట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీటీం సిబ్బంది, పోలీస్ అక్క సిబ్బంది పాల్గొన్నారు.

## కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలి

-రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న



**బోథ్, జూలై 2 (ప్రజా జ్యోతి)** సాగుదారుల చట్టాన్ని అనుసరించి కౌలు రైతులకు రుణ అర్హత గుర్తింపు కార్డులను ప్రభుత్వం వెంటనే అందించాలని శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన కౌలు రైతులతో కలిసి మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతుల బాధలను గుర్తించి వెంటనే ప్రభుత్వ పథకాలను భూ యజమానులతో సంబంధం లేకుండా పలు పథకాలను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## రూ. 1.50 కోట్లతో నిర్మిస్తున్న కొత్తపల్లి బ్రిడ్జిని పరిశీలించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### చిరకాల వాంఛను నెరవేర్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తుల కృతజ్ఞతలు

### ఏ నాయకుడు చేయని పనులు చేయడమే నా ప్రధాన లక్ష్యం





**బజార్ హత్నూర్, జూలై 2, (ప్రజా జ్యోతి)** బజార్ హత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల మారుమూల ప్రాంతం కొత్తపల్లి గ్రామస్తుల చిరకాల వాంఛగా ఉన్న బ్రిడ్జి సమస్యను స్వాతంత్రం వచ్చిన తర్వాత బోథ్ ఎమ్మెల్యే అ నిల్ జాదవ్ తీర్చారు. ఈ సం దర్భంగా రూ. 1.50 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో కలిసి పరిశీలించారు. గ్రామస్తులు డప్పులతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు అయిన మా గ్రామానికి మాత్రం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కృషి ఫలితంగా ఈరోజు స్వాతంత్ర్యం వచ్చిందని తెలుపుతూ భావోద్వేగానికి గురయ్యారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఎందరో ఎమ్మెల్యేలు వచ్చిన తీర్చని కొత్తపల్లి గ్రామస్తుల కష్టాన్ని తీర్చడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ఎవరు చేయని పనులను, కష్టాలను తీర్చడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధే 'ఆరోగ్య పాఠశాల' లక్ష్యం





జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**బజార్ హత్నూర్, జూలై 2 (ప్రజా జ్యోతి)**జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భద్రత, వ్యక్తిత్వ వికాసమే లక్ష్యంగా 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలె క్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. గురువారం బజార్ హ త్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో నిర్వహించిన మూడవ విడత ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య లతో క లిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు,వి ద్యార్థులు ఆరోగ్య పాఠశాలలోని అంశాలపై పాటలు, నృత్యం, నాటిక రూపంలో అవగాహన కల్పించారు. సంబంధిత అధికారులు ఆరోగ్య పాఠశాలలోని ఆరు అంశాలపైన వ్యక్తిగత పరిశుభ్రత, పోషకా హారం, మానసిక ఆరోగ్యం, మాదకద్రవ్యాల నివారణ, కా లానుగుణ వ్యాధుల నివారణ, వ్యక్తిత్వ వికాసం పై వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం విద్య, భద్రత, వ్యక్తిత్వ వికాసమే లక్ష్యంగా 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుంద న్నారు. గత రెండేళ్లుగా జిల్లాలో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగు తుందని, దీనికిగాను గతంలో జిల్లాకు అవార్డు లభించిందని గుర్తుచేశారు. ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థుల రక్షణకై 'పోక్సో చట్టం'పై ప్రత్యేక అవగాహన కల్పించడంతో పాటు, 'పోక్సో క్యాలెండర్'ను విడుదల చేసినట్లు తెలిపారు. విద్యార్థులు తమకు ఎదురయ్యే రకరకాల సమస్యలను నిర్భయంగా, గోప్యంగా చెప్పు కునేందుకు పాఠశాలల్లో 'ఫిర్యాదుల పెట్టెలను' ఏర్పాటు చేస్తున్నామని, వీటిని ప్రతి నెల ఒకటో తేదీన ప్ర ధానోపా ధ్యాయుల ఆధ్వర్యంలో తెరిచి సమస్యలను తక్షణమే పరి ష్కరిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ మల మూత్ర విసర్జన వల్ల వచ్చే అ నారోగ్య సమస్యలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా తమ సొంత ఖర్చులతో ఇంట్లోనే మరుగుదొడ్లు నిర్మించు కుని వాడాలని కోరారు. వర్షాకాలం దృష్ట్యా ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రత పాటించాల న్నారు. విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషా నైపుణ్యాల ను పెంచేందుకు దేశ ప్రముఖుల జీవిత చరిత్రలను ఇంగ్లీష్ పీరియడ్లలో విద్యార్థుల చేత చదివించాలని, అలాగే 'ఖాన్ అకాడమీ' ద్వారా గణితం, సైన్స్ సబ్జెక్టులపై పట్టు సాధించాలని సూచించారు.



ఈసారి జిల్లా నుండి ట్రిపుల్ ఐటీ బాసరాకు రికార్డు స్థాయిలో 67 మంది విద్యార్థులు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు చదు వుతో పాటు మంచి ఆరోగ్యం అత్యంత కీలకమని తెలిపా రు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌లో అడ్మిషన్ల డిమాండ్ ఎంతో పెరుగుతోందని, జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా రూపొందించిన ఆరోగ్య పాఠశాల, విద్యా క్యాలెండర్ మరెక్కడా లేదని, వారి సమర్థవంత మైన పనితీరు వల్ల అదిలాబాద్ జిల్లాకు జాతీయ స్థాయిలో పలు అవార్డులు దక్కాయ నికొనియాడారు. తల్లిదండ్రులు పిల్లను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలన్నారు. పాఠశాలల అభివృద్ధిలో భాగంగా మోడల్ స్కూల్ ఆవరణలో సీసీ రోడ్డు, బోర్‌వెల్ సదు పాయాన్ని త్వరలోనే కల్పిస్తా మన్నారు. అలాగే గతంలో ఇబ్బంది పడిన కొత్తపల్లి గ్రామా నికి సుమారు రూ. 1 కోటి నిధులతో బ్రిడ్జిని మంజూరు చేయించామని చెప్పారు. విద్యా ర్థుల ఆరోగ్య రక్షణకు ప్రాధా న్యత ఇస్తూ, అన్ని కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో సొంతంగా మంచినీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరిం చారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లె పూల నర్సయ్య మా ట్లాడుతూ, విద్యార్థుల పట్ల జిల్లా కలెక్టర్ చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా శాఖ బలోపేతాని కి కృషి చేస్తున్నారని, ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని వెల్లడించారు. విద్యార్థు లు వ్యసనాలు, చెడు అలవాట్ల జోలికి వెళ్లకుండా చదువు పట్ల శ్రద్ధ వహించి, ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా పోక్సో చట్టం- 2012 క్యాలెండర్ ను కలెక్టర్, ఎమ్మెల్యే, చైర్మెన్ ఆవిష్కరించారు. అనం తరం పోషకాహార తోటను ప్రారం భించి, మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్, ఏంఆర్వో శ్యామ్ సుందర్, ఎంపీడీవో మహేంద ర్ రెడ్డి, ఏంఈఓ రాంకిషన్, అకడమిక్ కో ఆర్డినేటర్లు లక్ష్మణ్, అజయ్, స్థానిక సర్పంచ్ సాయన్న, ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# 'ఎస్ఐఆర్' ప్రక్రియను పరిశీలించిన కాంగ్రెస్ యువ నేత ఎండీ సద్దాం

**నేరడిగొండ, జూలై 2 ప్రజా జ్యోతి** మండల కేంద్రంలో కొనసాగుతు న్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఎండీ సద్దాం గురువారం నాడు స్థానిక బీఎల్ఓలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల ఎన్యుమరేషన్ ఫార్మ్‌లను ప్రజలకు అందజేశారు. అనంతరం, మండల కేంద్రంలో ఇప్పటివరకు జరిగిన ఎన్యుమరేషన్ ప్రక్రియ, ఫార్మ్‌ల పంపిణీ మరియు నమోదు విధానంపై బీఎల్ఓలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎండీ సద్దాం మాట్లాడుతూ... ప్రజలు ఎన్యుమరేషన్ ఫార్మ్‌లను నింపే సమయం లో ఎలాంటి సమస్యలు లేదా సందేహాలు ఉన్నా, వెంటనే కాంగ్రెస్



పార్టీకి చెందిన 'బీఎల్ఏ 2' ప్రతినిధులను సంప్రదించి పరిష్కరించు

# అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ చైర్మన్ దేవతాడే మంగేష్ కు ఘణ సన్మా నం



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 2, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ క మిటీ లీగల్ సెల్ చైర్మన్ గా ని యమితులైన దేవ తాడే మంగేష్‌ను జిల్లా కేంద్రంలోని రిక్షా కాలనీ సీతా రామచంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఘణంగా సన్మానించారు. గు రువారం ఉదయం ఆలయ ప్రాంగణంలో మంగేష్‌ను శా లువాల తో సన్మానించారు. ఈ సందర్భంగా సామాజిక సేవకురాలు సుభద్ర భాయి మాట్లాడుతూ దేవతాడే మం గేష్ జిల్లా లీగల్ సెల్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్‌గా నియమితు లుకావడం చాలా సంతోషకరమని, మంచి సౌమ్యులు, శాం తిపరుడు అయిన మంగేష్ ఇంత చిన్న వయసులోనే కాం గ్రెస్ పార్టీ లీగల్ సెల్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైనందుకు ఆలయ కమిటీ సభ్యులు అంద రూ ఆయనని అభినందించారు. రాబోయే రోజులలో మంగేష్ మరిన్ని రాజకీయాల్లో ఉన్నత పదవులను చేపట్టి పేద, నిరుపేదల కు మరిన్ని సేవలను అందించే అవకాశాన్ని ఆభగ వంతుడు కల్పించాలని కోరారు. ఈ సన్మాన కార్యక్రమంలో సామాజిక సేవకురాలు సుభ ద్రభాయి ఆలయ కమిటీ సభ్యులు రిక్షా కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# వరద ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఆదిలాబాద్ టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. నాగరాజు



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 2, (ప్రజా జ్యోతి)** రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని వరద ముంపు ప్రాంతాల్లో చేపట్టా ల్సిన ముందస్తు చర్యలపై ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. నాగరాజు గురువారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థా యిలో పరిశీలన నిర్వహించారు. మున్సిపాలిటీ, రెవెన్యూ శాఖల అధికారులతో సమన్వయంగా పట్టణంలోని మహాలక్ష్మి వాడ, గాంధీనగర్, జై జవాన్ నగర్ ప్రాంతాలను సందర్శించి, గతంలో వరదలవల్ల నీరు నిలిచిన ప్రాంతాలు, నీటి ప్రవాహ మార్గాలు, డ్రైనేజీ ప రిస్థి తులను పరిశీలించారు. ఈ సందర్భంగా భారీ వర్షాల సమయం లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్య లు చేపట్టాలని, నీటి ప్రవాహానికి ఆటంకాలు తొ లగించడం, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయడం, సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. వరదలు లేదా అత్యవసర పరిస్థితులు త లెత్తినప్పుడు ప్రజలకు వెంటనే సహాయక చర్యలు అందేలా కార్యా చరణ ప్రణాళిక సిద్ధంగా ఉంచాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, స్థానిక ఎమ్మార్వో శ్రీనివాస్, కౌన్సిలర్లు విలాస్, మీరాబాయితో పాటు మున్సిపాలిటీ, రెవెన్యూ శాఖల అధికారులు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బైండోవర్ నిబంధనలు ఉల్లం ఘించిన వ్యక్తికి రూ.50 వేల జరిమానా

**అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు**

**బైండోవర్‌లో ఉన్నవారు నిబం ధనలు తప్పనిసరిగా పాటించాలి**

**రూరల్ సీఐ రహీం పాషా**



**ఆదిలాబాద్ టౌన్, జూలై 2 (ప్రజా జ్యోతి)**ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల గూడ గ్రామానికి చెందిన ఎస్. దినేష్ గౌడ్ (34), తండ్రి సుధాకర్ గౌడ్ అనే వ్యక్తి అక్రమంగా అనుమతులు లేకుండా మద్యం(తెల్ల కళ్ళు) విక్రయించిన కేసులో గతంలో ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైండో వర్ చేయబడ్డాడు. అయితే, బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి తిరిగి అదే తరహా నేరానికి పాల్పడినట్లు గుర్తించిన ఆదిలాబాద్ రూరల్ పోలీసులు అతనిపై చర్యలు చేపట్టి, బైండోవర్ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి ఆదిలాబాద్ రూరల్ మండల తహసీల్దార్ (ఎంఆర్ఓ) కార్యాలయానికి నివేదిక పంపారు. దీ నిపై విచారణ అనంతరం సం బంధిత నిందితుడికి రూ. 50, 000 జరిమానా విధించగా, ఆ మొత్తాన్ని చెల్లించినట్లు ఆది లాబాద్ రూరల్ సీఐ రహీం పాషా తెలిపారు. ఈ సంద ర్భంగా సీఐ మాట్లాడుతూ, బైండోవర్‌లో ఉన్న వ్యక్తులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వాటిని ఉల్లం ఘించి మళ్లీ నేరాలకు పాల్ప డితే జైలు శిక్షతో పాటు భారీ జరిమానా కూడా విధించబ డుతుందని హెచ్చరించారు. ప్రజలు శాంతిభద్రతలకు భంగం కలిగించే లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా బాధ్యతాయుతంగా వ్యవ హరించాలని సూచించారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పెం డింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి





**ఆదిలాబాద్ బ్యూరో,జూలై 2, (ప్రజా జ్యోతి)** డబుల్ బెడ్రూం ఇళ్ల పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేసి పంపిణీకి సిద్ధం చేయాల ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధి కారులను ఆదేశించారు. గురు వారం కలెక్టరేట్ కార్యాలయంలో మావల, కేఆర్కే కాలనీలో లబ్ధిదారుల కేటాయింపుకు సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లో మౌలిక సదుపాయాల కల్పన, ఇతర పెండింగ్ పనుల పురో గతిపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సంబంధించిన విద్యుత్, త్రాగునీరు, శానిటేషన్, ఇతర పెండింగ్ పనులన్నింటినీ వెంటనే త్వరి తగతిన పూర్తి చేయాలని అధి కారులను ఆదేశించారు. నిర్మాణాలు, మరమ్మత్తు పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిష నర్ జగదీశ్వర్ గౌడ్, హౌసింగ్ డిఈ షకీర్, ఇంజనీరింగ్, రెవెన్యూ, ఇతర సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రనే లక్ష్యంగా ప్రతి గ్రామంలో సిసి టీవీ కెమెరాలు ఏర్పాటు చెయ్యాలి

సీసీటీవీ వ్యవస్థ గ్రామ భద్రతకు మూడో కన్నుగా పనిచేస్తుంది

ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రాంతాలు ప్రజలు అధికంగా సంచారించే ప్రదేశాల్లో:బిబి

ప్రధాన కూడళ్ళు గ్రామ ప్రవేశ,నిష్క్రమణ మార్గాలు,మార్కెట్ ప్రాంతాలో సీసీటీవీలు ఏర్పాటు చేయడం వల్ల:

నేరాల నివారణ సమర్థవంతంగా అరికట్టడంతో పాటు నేరస్తులను త్వరగా గుర్తించి చట్టం ముందు నిలబెట్టేందుకు:

సమ్మర్థవంతంగా పనిచేస్తుంది. మండల సర్పంచ్,గ్రామ పంచాయితీ కార్యదర్శుల సమీక్ష సమావేశంలో:

మాట్లాడుతున్నకాగజ్నగర్ డిఎస్పి వహీదుద్దీన్, సీఐ సంతోష్ కుమార్:







**జులై 2 సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలంలోని గ్రామాలు శాంతి భద్రతలను మరింత పటిష్టం చేయడం కొరకు నేరాల నివారణ దర్యాప్తును వేగాంతం చేయడానికి ప్రజల భద్రతే లక్ష్యంగా సీసీటీవీ కెమెరాల ఏర్పాటు కొరకు బుధవారం నిర్వహించిన గ్రామపంచాయతీల కార్యదర్శిల, సర్పంచుల సంయుక్త సమావేశంలో కాగజ్నగర్ డిఎస్పి వహీద్ ఉద్దీన్ సిఐ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, గ్రామ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు మార్కెట్ ప్రాంతాలు అదేవిధంగా ప్రజలు అధికంగా సంచరించే ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను సమర్థవంతంగా అరికట్టడంతో పాటు, నేరస్థులను త్వరితగతిన గుర్తించి చట్టం ముందు నిలబెట్టేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అంతేకాకుండా, సీసీటీవీ వ్యవస్థ గ్రామ భద్రతకు మూడో కన్నుగా పనిచేస్తుందని, ప్రతి గ్రామం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విని యోగించు కొని సురక్షిత గ్రామంగా రూపుదిద్దుకోవాలని సూచించారు. ఈ సమావేశానికి సిర్పూర్(టి) మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు హాజరై, తమ తమ గ్రామాల్లో ప్రజల సహకారంతో వీలైనంత త్వరగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, గ్రామాల భద్రత కోసం పోలీసు శాఖతో సమన్వయంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సహకారంతో నేర రహిత సమాజ నిర్మాణం సాధ్యమవు తుందని, పోలీసు శాఖ చేపడుతున్న భద్రతా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ వహీదుద్దీన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అమరుల త్యాగాల పునాదులపై అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ తెలంగాణలో ఆధిపత్యం చెలాయించింది కల్వకుంట్ల కుటుంబం కాదా.?


**హైద్రాబాద్** : అమరుల త్యాగాల పునాదులపై అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్తెలంగాణలో ఆధిపత్యం చెలాయించింది కల్వకుంట్ల కుటుంబం కాదా.?అనికాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరాశోభన్ ప్రశ్నించారు.నేడు ఃఖీూ పేరు మీద కేటీఆర్, హరీష్ రావు.. ఃఖీూ పేరుతో కవిత రాజకీయ డ్రామాలాడుతున్నారని ఆమె విమర్శించారునీళ్లు, నిధులు, నియామకాలు పేరుతో తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి.. రాజకీయ ఉద్యోగాలు కేవలం ఒక్క ఫ్యామిలీకే దక్కడం వాస్తవం కాదా.?అని అన్నారు.మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి.. తమ ఆస్తులు పెంచుకున్న చరిత్ర వాళ్ళది దుయ్యబట్టారు. వాళ్ల దోపిడీని కప్పిపుచ్చుకోవడానికే.. రేవంత్ రెడ్డి సర్కార్ పై నిత్యం అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు.ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లింది ఈ కల్వకుంట్ల కుటుంబ మన్నారు.ఇకనైనా ఃఖీూ పేరు మీద కేటీఆర్, హరీష్ రావు.. ఃఖీూ పేరుతో కవితలు ఆడుతున్న రాజకీయ డ్రామాలను ఆపాలని ఇందిరా

## సిఐటియు నాయకుల అరెస్టులకు నిరసనగా ధర్నా

**చిట్వేలి** : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగంపేటలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం విబి జి రాంజీ పథకంగా పేరు మార్చుతూ నేడు ప్రారంభోత్సవం సందర్భంగా రైల్వేకోడూరులో సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్ చంద్రశేఖర్ ను, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పందికాళ్ళ మణి ని చిట్వేలి లో పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయం అని సిఐటియు చిట్వేలి మండల కన్వీనర్ వై. సుజాత, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఓబిలి పెంచలయ్య తీవ్రంగా ఖండించారు. చిట్వేలి ఉపాధి హామీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వారు మాట్లాడుతూ వాస్తవాలను ప్రశ్నిస్తున్నందుకు సమాధానం చెప్పలేక, ఇలా ఉద్యమాలను అడ్డుకోవడం సరికాదన్నారు. ఉపాధి హామీ చట్టం 2006లో వామపక్షాల పోరాటంతో సాధించారని. దాన్ని నిర్వీర్యం చేసేందుకు విబి జి రాంజీ పథకంగా మార్చి ప్రారంభోత్సవం చేస్తున్నారని, ఇది ప్రారంభోత్సవం కాదని ముగింపు అని విమర్శించారు. 90 శాతం కేంద్ర నిధులతో చేపట్టే ఉపాధి చట్టం, పథకం గా మార్చి, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాలని చెప్పడము అన్యాయం అన్నారు.

# పాఠశాలలకు విద్యార్థులు 100 శాతం హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి





తెలంగాణ రాష్ట్ర అడిషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీనివాస చారి

**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 2 (ప్రజా జ్యోతి)** ప్రభుత్వ పాఠశాలలో చదువు తున్న విద్యార్థులు 100% హా జరయ్యే విధంగా చర్యలు తీ సుకోవాలని విద్యాశాఖ తెలం గాణ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస చారి ఆదేశించారు. అడిషనల్ డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫ్ తెలంగాణ శ్రీ నివాస చారి అధ్యక్షతన గురువారం ఆదిలాబాద్ జిల్లా లోని అన్ని మండలాల ఎంఈ ఓ లు, కాంప్లెక్స్ ప్రధాన ఉపా ధ్యాయులు, హైస్కూల్ హెడ్ మాస్టర్స్ ,కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లతో విద్యా విష యక అంశాలపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్రోల్మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన (63,566)టార్గెట్ కు చాలా దగ్గరగా (56,067) ఉండటంతో జిల్లా విద్యాశాఖ అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు ,వర్క్ పుస్తకాలు అన్నిటిని కూడా 100% ఆన్ లైన్‌లో నమోదు చేయాల్సిందిగా పాఠశాలలో నమోదైన విద్యార్థులు అందరూ ప్రతిరోజు 100% హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అదే విధంగా మధ్యాహ్న భోజన విషయంలో నాణ్యమైన భో జనాన్ని అందించేందుకుని రంతర పర్యవేక్షణ ఉండాలని, ప్రీ ప్రైమరీ తరగతుల విషయంలో ప్రతి ప్రీ ప్రైమరీ సెక్ష న్లో 25 మంది విద్యార్థులు త గ్గకుండా ఎన్రోల్మెంట్ పెంచాల్సిందిగా కోరారు. ఈ సమావే శంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి సెక్టోరల్ అధికా రులు పాల్గొన్నారు.

## 200 కాదు.. ఇక 180 ప్రశ్నలతోనే నీట్ పీజీ అప్ డేట్స్

**హైదరాబాద్ :** ఈ ఏడాది నీట్ పీజీ 2026 పరీక్షను ఆగస్టు 30న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు దేశ వ్యాప్తంగా ఒకే షిఫ్టులో నిర్వహిం చనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) ప్రకటించింది. ఈ మేరకు తాజాగా పూర్తి షెడ్యూల్ విడుదల చేసింది. ఇక ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ జులై 21వ తేదీ రాత్రి 11.55 గంటల వరకు కొనసాగనుంది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా త్వరిత గతిన దరఖాస్తు చేసుకోవాలని ఎన్బీయే పేర్కొంది. అంతేకాకుండా ఈసారి దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ విధానంలో నీట్ పీజ పరీక్ష నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. పరీక్ష కేంద్రాల కేటాయింపు సమాచారం ఆగస్టు 11న వెల్లడిస్తామని తెలిపింది. ఇక నీట్ పీజీ 2026 పరీక్ష ఫలితాలు సెప్టెంబరు 30న విడుదల చేయనున్నట్లు పేర్కొంది. ఈ ఏడాది నీట్ పీజీ పరీక్షల విధానంలో పలు కీలక మార్పులు చేసింది. ముఖ్యంగా పరీక్షలో ప్రశ్నల సంఖ్యను గణనీయంగా తగ్గించింది. గతంలో నీట్ పీజీ పరీక్షలో 200 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇచ్చేవారు. ఈ ఏడాది మాత్రం వాటిని 180కి తగ్గించనున్నారు. అంటే ఇకపై నీట్ పీజీ ప్రవేశ పరీక్ష కేవలం 180 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు మాత్రమే జరగనుంది. అయితే మార్కింగ్ విధానంలో ఎలాంటి మార్పు లేదు. ప్రతి సరైన సమాధానానికి అభ్యర్థులకు నాలుగు మార్కులు లభిస్తాయి. అయితే ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు చొప్పున కోత విధిస్తారు. సమాధానం ఇవ్వని ప్రశ్నలకు ఎలాంటి మార్కులు ఉండవు. అలాగే తగ్గించారు కూడా. వైద్య పాఠ్యప్రణాళికలోని అంశాలపై అభ్యర్థుల జ్ఞానాన్ని, అవగాహనను అంచనా వేయడానికి రూపొందించిన 180 బహుళైచ్ఛిక ప్రశ్నల ద్వారా అభ్యర్థులను మదింపు చేయనున్నారు. నీట్ పీజీ దరఖాస్తు రుసుములో కూడా మార్పు చేశారు. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు చెందిన అభ్యర్థులు రూ. 3,500 చొప్పున చెల్లించవల్సి ఉంటుంది. మిగిలిన అన్ని కేటగిరీల అభ్యర్థులు రూ. 2,500 చెల్లించాల్సి ఉంటుంది. మరో ముఖ్యమైన మార్పు ఏమంటే.. పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసుకునే ప్రక్రియను ఔఇఊా సవరించింది. అభ్యర్థులు ఇకపై తమకు నచ్చిన పరీక్షా నగరాలను ఎంచుకోవడానికి బదులుగా, దరఖాస్తు ఫారమ్‌ను నింపేటప్పుడు మూడు రాష్ట్రాలను ఎంచుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారమ్‌లో అభ్యర్థి అందించిన చిరునామాకు సంబంధించిన రాష్ట్రాన్ని మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాలి. రెండవ, మూడవ ప్రాధాన్యతలు పొరుగు రాష్ట్రాలుగా ఉండాలి. దరఖాస్తు ఫారమ్‌ను సమర్పించిన తర్వాత దరఖాస్తు సవరణల విండోతో సహా ఏ దశలోనూ చిరునామాను గానీ, ఎంచుకున్న రాష్ట్ర ప్రాధాన్యతలను గానీ సవరించడానికి వీలులేదని బోర్డు స్పష్టం చేసింది.

## ఏజెన్సీ నియోజకవర్గాల్లో అదనంగా రెండు వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

**సీఎం రేవంత్ రెడ్డికి కోరిన గిరిజన ఎమ్మెల్యేలు**

**హైదరాబాద్ :** ఏజెన్సీ ప్రాంతంలోని శాసనసభ నియోజకవర్గాల్లో అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని ఆదివాసీ, గిరిజన ప్రాంత శాసనసభ్యులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని కోరారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క నేతృత్వంలో ఆదివాసీ, గిరిజన శాసనసభ్యుల బృందం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి కలిసి ఆ మేరకు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు ఇందిర గిరి జల వికాసం పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఐటీడీఏలను మరింత బలోపేతం చేయడంతో పాటు గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఇంటర్ వరకు అప్ గ్రేడ్ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి ని కలిసిన వారిలో ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ (అశ్వరావుపేట), పాయం వెంకటేశ్వర్లు (పినపాక), కోరం కనకయ్య (ఇల్లందు), తెల్లం వెంకట్రావు (భద్రాచలం), వెడ్మ బొజ్జు (ఖానాపూర్) ఉన్నారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, , అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహమ్మద్ అజారుద్దీన్ కూడా ఉన్నారు.

## గూడూరులో 751 గ్రాముల గంజాయితో ముగ్గురు అరెస్ట్

**గూడూరు :** గూడూరు పట్టణంలోని పులకుర్తి క్రాస్ రోడ్డులో ఉన్న శ్రీ చింతలముని స్వామి ఆలయం సమీపంలో 751.20 గ్రాముల గంజాయితో ముగ్గురు వ్యక్తులను గూడూరు పోలీసులు అరెస్ట్ చేశారు. కోడుమూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. తబ్రేజ్ సమాచారం మేరకు, గూడూరు ఎస్ఐ బి. రాజ కుళ్లయప్ప ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో సీబీ షైన్ మోటార్ సైకిల్ (ఏపీ–39–బీఈ–7555)పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, గెజిటెడ్ అధికారి మరియు స్వతంత్ర పంచాయతీదారుల సమక్షంలో సోదా చేపట్టారు. వారి వద్ద ఉన్న మూడు కవర్లలో మొత్తం 751.20 గ్రాముల గంజాయి లభ్యమైంది. ఈ సందర్భంగా గంజాయితో పాటు ఒక వివో మొబైల్ ఫోన్, గంజాయి రవాణాకు ఉపయోగించిన హీరో సీబీ షైన్ మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిలో గూడూరుకు చెందిన భక్త కృష్ణమూర్తి (40), పొన్నకల్ గ్రామానికి చెందిన బోయ వెంకట్రాముడు (58), ప్రస్తుతం గూడూరులో నివాసం ఉంటున్న సి.బెళగల్ మండలం బురందొడ్డి గ్రామానికి చెందిన బెస్త ఉదయ్ కుమార్ (20)

## ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడి

**ఆదిలాబాద్ ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**

**మావల రైతు వేదికలో 'కాపస్ క్రాంతి' రైతులకు పత్తి విత్తనాల పంపిణీ**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 2, (ప్రజా జ్యోతి)** ఆధునిక సాగు పద్ధతులతోనే అధిక దిగుబడులు సాధించ వచ్చని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా మావల రైతు వేదికలో 'మిష న్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ – కాపస్ క్రాంతి' కార్యక్రమంలో భా గంగా రైతులకు పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఎంఎంసి) చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఆత్మ చైర్మన్ సంతోష్, జిల్లా వ్యవ సాయాధికారి రవీందర్ సింగ్ ముఖ్య అతిథులుగా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఏఎం సీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతులు అధిక సాంద్రత పద్ధతిని అను సరించడం ద్వారా తక్కువ వి స్తీర్ణంలోనే ఎక్కువ దిగుబడి సాధించే అవకాశం ఉందని వివరించారు. ఈ ఆధునిక సాగు పద్ధతులను పాటించడం వల్ల పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుని, అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. రై తులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ మంచి పంట దిగుబడిని అందుకోవా లని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడిఏ)లు, మండల వ్యవసాయాధికారి (ఎం ఏఒ)లు మావల, వాఘపూర్ సర్పంచులు ధర్మపురి చంద్ర శేఖర్, దినేష్‌లు, ప్రజా ప్రతి నిధులు, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మత్తు పనులకు శ్రీకారం

**చుట్టిన సర్పంచ్ జి. సుభాష్**

**ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రాధాన్యం: భోరజ్ గ్రామ సర్పంచ్**




**బజార్హత్నూర్ జులై 02,( ప్రజా జ్యోతి)** అదిలా బాద్ జిల్లా బజార్హత్నూర్ మండల కేంద్రం లోని గ్రామంలో దెబ్బతిన్న రహ దారి కారణంగా ప్రజలు, వాహన దారులు పడుతున్న ఇబ్బందులకు భోరజ్ గ్రామ పంచాయతీ తక్షణ పరిష్కారం చూపింది. రోడ్డు అధ్వాన్నంగా మారి రాకపో కలకు తీవ్ర అంతరాయం కలుగుతున్న విషయాన్ని గుర్తించిన గ్రామ సర్పంచ్ జి. సుభాష్ వెంటనే స్పందించారు. ప్రజల, ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన పర్యవేక్షణలో రహదారిపై కంకర (మెటలింగ్) వేయించి, గుంతలను పూడ్చే మరమ్మత్తు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పథంలో భోరజ్ గ్రామం: ఈ సందర్భంగా సర్పంచ్ జి. సుభాష్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే తమ మొదటి ప్రాధాన్యతని పేర్కొన్నారు. భోరజ్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులతో గ్రామాన్ని ముందంజలో ఉంచుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.